# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 36 | విశాఖపట్నం | 6-11-2025 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 36 | VISAKHAPATNAM | 6-11-2025 THURSDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934


## 'వసంతం-2025' వస్త్ర ప్రదర్శనను

# ప్రారంభించిన లోకేశ్



**విజయవాడ, పతాకం న్యూస్:** విజయవాడ నగరంలోని ఎంజీ రోడ్డులో ఉన్న శ్రీ శేషసాయి కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన 'వసంతం-2025' చేనేత, చేతివృత్తుల ప్రదర్శనను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ బుధవారం ప్రారంభించారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన సహజ రంగులతో తయారుచేసిన 'కొత్తూరు వసంత వర్ణ' అనే నూతన చేనేత బ్రాండ్‌ను ఆవిష్కరించారు. ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు, చేతివృత్తుల వారు రూపొందించిన ఉత్పత్తులను 70కి పైగా స్టాళ్లలో ప్రదర్శనకు ఉంచారు. ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం మంత్రి లోకేశ్ అక్కడి స్టాళ్లను సందర్శించి, ఉత్పత్తులను పరిశీలించారు. కళాకారులతో మాట్లాడి వారి నైపుణ్యాన్ని అభినందించారు.దీనిపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, "క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ప్రారంభించడం సంతోషంగా ఉంది. ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించాను. మన కళాకారుల ప్రతిభ అద్భుతంగా ఉంది. ప్రకృతి సహజసిద్ధ రంగులతో తయారుచేసిన 'కొత్తూరు వసంత వర్ణ' బ్రాండ్‌ను ఆవిష్కరించడం ఆనందదాయకం" అని తెలిపారు. చేనేత కళకు, చేతివృత్తుల వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# రాష్ట్ర వ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ దాడులు

## పరారైన డాక్యుమెంట్ రైటర్లు

**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. 120 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం, ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, విజయనగరం జిల్లాలోని భోగాపురం, సత్యసాయి జిల్లాలోని చిలమత్తూరు, నెల్లూరు జిల్లాలోని స్టోన్‌హౌస్‌పేట, విశాఖపట్నం జిల్లాలోని మధురవాడ, పల్నాడు జిల్లా నరసరావుపేట తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ దాడులు చేపట్టినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ ఆకస్మిక దాడులు చేసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు రావడంతో అధికారులు మెరుపు దాడులు చేశారు. బయట వ్యక్తులను (తరువాయి 2వ పేజీలో)





# విమానాశ్రయ పనులను సమీక్షించిన రామ్మోహన్ నాయుడు

**భోగాపురం, పతాకం న్యూస్:** మండలంలో నిర్మితమవుతున్న అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణ పనులను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గురువారం సాయంత్రం పరిశీలించారు. పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడారు. విమానాశ్రయ ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయని, జూన్ 2026 నాటికి పూర్తి చేయగలమని మంత్రి తెలిపారు.(తరువాయి 2వ పేజీలో)

# ప్రజల ప్రాణాలంటే చంద్రబాబుకు లెక్కలేదా?: బొత్స



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏపీలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతుల సమస్యలు, కాశీబుగ్గ తొక్కిసలాట ఘటన వంటి పలు అంశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆయన ఎండగట్టారు. ప్రకృతి విపత్తులతో రైతులు తీవ్రంగా నష్టపోతే ప్రభుత్వం నుంచి కనీస భరోసా కరవైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం మీడియాతో మాట్లాడిన బొత్స, తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. "వైసీపీ హయాంలో రైతులకు గిట్టుబాటు ధర, సబ్సిడీ అందించడంతో పాటు పంటల బీమా ప్రీమియంను కూడా ప్రభుత్వమే చెల్లించింది. కానీ ఈ ప్రభుత్వం ఆ భారాన్ని రైతులపైనే మోపుతోంది. ఇప్పటివరకు పంట నష్టంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. సీఎం, మంత్రుల మాటలు తప్ప చేతల్లో ఏమీ కనిపించడం లేదు" అని విమర్శించారు. రైతుల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనపై బొత్స తీవ్రంగా స్పందించారు. అది ప్రైవేట్ ఆలయమని చెప్పడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. (తరువాయి 2వ పేజీలో)



4లో

## మంగినపూడి బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం: మంత్రి కొల్లు

## కూటమి ప్రభుత్వంతోనే

# రైతులకు న్యాయం: నాదెండ్ల



**అమరావతి, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతోనే రైతులకు నిజమైన న్యాయం జరుగుతోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని ఆయన వెల్లడించారు. విజయవాడలోని సివిల్ సప్లై భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సుమారు రూ.12,200 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 4,041 రైతు సేవా కేంద్రాలు, 3,803 ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేశామని, 16,700 మంది సిబ్బంది ఈ ప్రక్రియలో పాల్గొంటారని వివరించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని 6 కోట్ల గోతాలను అందుబాటులో ఉంచామన్నారు. గత ప్రభుత్వం రైతులకు రూ.1,670 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లిందని, ధాన్యం డబ్బులను 6 నుంచి 9 నెలల వరకు చెల్లించకుండా ఇబ్బంది పెట్టిందని నాదెండ్ల మనోహర్ విమర్శించారు. అయితే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 87 శాతం ధాన్యం డబ్బులను కేవలం 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేసిందని గుర్తుచేశారు. ఈసారి ఆ సమయాన్ని 24 గంటలకు తగ్గించేందుకు కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారు. తేమ శాతం కొలతలో పారదర్శకత కోసం ఒకే కంపెనీకి చెందిన యంత్రాలను వాడతామని, అవసరమైతే బ్లూటూత్ ద్వారా రీడింగ్ తీసుకునే వ్యవస్థ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వాట్సాప్‌లో "HI" అని మెసేజ్ చేయడం ద్వారా రైతులు తమ ధాన్యం అమ్మకం షెడ్యూల్ చేసుకునే సౌకర్యాన్ని కూడా కల్పించామన్నారు. జనవరి నుంచి రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి కిలో గోధుమపిండిని రూ.18కే అందిస్తామని మంత్రి ప్రకటించారు. ఇందుకోసం 2,400 మెట్రిక్ టన్నుల గోధుమపిండిని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ మాసంలో వర్ష సూచన ఉన్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు 50 వేల టార్పాలిన్‌లను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు.

# అభివృద్ధి పనులపై ఫోకస్ పెట్టండి: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీలో జరుగనున్న అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఏపీ సచివాలయంలో మొంథా తుపాను నష్టం, అవనిగడ్డ నియోజకవర్గ అభివృద్ధిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇవాళ(బుధవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకి డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా నదిపై హై లెవెల్ వంతెనతో దీవుల్లోని గ్రామాలు అనుసంధానం చేసేలా వంతెన నిర్మాణం చేపడుతున్నామని పవన్ కల్యాణ్ వెల్లడించారు.


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY / తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## స్వర్ణ దీప్తులు

ఐదు దశాబ్దాల కలను భారత మహిళలు సాకారం చేశారు. ఆకాశమే హద్దుగా అద్భుత ప్రదర్శనతో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని అమ్మాయిల జట్టు ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచింది. అడ్డంకులన్నీ అధిగమించి, బలమైన దక్షిణాఫ్రికా జట్టును 52 పరుగులతో ఓడించడం ద్వారా భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించింది. 1973లో మనదేశంలో మహిళా క్రికెట్ సంఘం ఏర్పడిన తర్వాత అంతర్జాతీయ పోటీల్లో భారత మహిళల ప్రస్థానం మొదలైంది. తొలితరం క్రికెటర్లు సొంత బ్యాటు, కిట్టు లేకపోయినా, జనరల్ బోగీల్లో ప్రయాణిస్తూ% సొంత డబ్బులపైనో, చందాలపైనో ఆధారపడి దేశం తరపున ఆడారు. ఆ తరువాత స్పాన్సర్లు ముందుకు రావడం, 2005లో బిసిసిఐ పరిధిలోకి రావడం జరిగాయి. 2022లో పురుషుల, మహిళల జట్ల మధ్య వేతన సమానత్వాన్ని, మహిళల ప్రీమియర్ లీగ్‌ను ప్రవేశపెట్టడం, అంతర్జాతీయ క్రికెటర్లతో ఆడే అవకాశం లభించడం, ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి రావడం% ఇవన్నీ మహిళల క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్లాయి. వరుసగా రెండుసార్లు అండర్ - 19 అమ్మాయిల జట్టు ప్రపంచకప్ నెగ్గడం, తాజాగా సీనియర్ జట్టు సాధించడం మహిళా క్రికెట్‌లో ఉజ్వల భవితకు పునాది. ప్రపంచకప్‌లో వరుసగా మూడు పరాజయాలతో డీలాపడిన జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో అమోల్ మజుందార్ కోచ్‌గా, మెంటార్‌గా అందించిన ప్రోత్సాహం ఆటగాళ్లలో మానసిక దృఢత్వాన్ని తీసుకొచ్చింది. డిఫెండింగ్ ఛాంపియన్, అప్పటికే ఓసారి ఓడించిన ఆస్ట్రేలియా సెమీఫైనల్స్‌లో 338 రన్స్ చేయడంతో భారత్ ఓడిపోతుందని క్రీడా పండితులు అంచనా వేశారు. ప్రత్యర్థులంతా చుట్టుముడుతున్నా% సహచరులు ఒక్కొక్కరు అవుటవుతున్నా% అవరోధాలకు ఎదురొడ్డి ఆస్ట్రేలియాపై అజేయంగా 127 పరుగులుచేసి భారత్‌ను విజేతగా నిలపడంలో కీలక పాత్ర జెమీమా రోడ్రిగ్స్‌దే. 'ఐ వుడ్ లైక్ టు థాంక్ జీసస్' అన్న ఆమె మాటలను మతోన్మాదులు విపరీతంగా ట్రోల్ చేయడం సిగ్గుచేటు. నైపుణ్యం, ఆటతీరే ఆటగాళ్ల ఎంపికకు ఆధారం కానీ, మతం కాదన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించిన ఇటువంటి భావజాలాన్ని తుదముట్టించాల్సిందే! మరొకరి మతంపై, విశ్వాసాలపై దాడి చేయడం అనాగరికం. కడపజిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల నల్లపురెడ్డి శ్రీచరణి లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌గా 9 మ్యాచ్‌లు ఆడి, 14 వికెట్లు తీయడం ద్వారా ప్రపంచకప్‌లో నాలుగో స్థానంలో నిలవడం ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లుసైతం ఆమె బౌలింగ్‌ను ఎదుర్కోవడానికి ఆపసోపాలు పడటం ఆమె నైపుణ్యానికి నిదర్శనం. 22 వికెట్లతో మన దేశానికే చెందిన దీప్తిశర్మ మొదటిస్థానాన్ని దక్కించుకుని, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌ను సొంతం చేసుకుంది. అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా వైస్ కెప్టెన్ స్మృతి మందాన నిలిచింది. గ్రూప్ దశలో బ్యాటింగ్‌లో స్మృతీ మంధాన, ప్రతీకా రావల్, అమన్‌జోత్, రిచా ఘోష్, బౌలింగ్‌లో దీప్తి శర్మ, క్రాంతిగౌడ్, రేణుకాసింగ్ సత్తా చాటారు. ఫైనల్స్‌లో షఫాలీ వర్మ సూపర్ ఇన్నింగ్స్, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షో, హర్మన్ ప్రీత్‌కౌర్ కెప్టెన్సీ ఇలా అందరి సమిష్టి కృషే జగజ్జేతగా నిలిపింది. జట్టులోని చాలామంది దిగువ మధ్యతరగతివారే. శ్రీచరణి తండ్రి రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో చిన్న ఉద్యోగి. గ్రామీణ నేపథ్యం నుంచి కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్ ఎదిగారు. మూడేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయి, ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్న రేణుక, పోలీస్ కానిస్టేబుల్ కుమార్తె క్రాంతిగౌడ్, తన తండ్రి చెక్కిన బ్యాట్‌తో కెరీర్ మొదలు పెట్టిన అమన్‌జోత్ లాంటి వారంతా అనేక కష్టాలను ఎదురొడ్డి నిలిచిన వారే. ఇన్ని కష్టాల మధ్య కుటుంబ సభ్యులు, కోచ్‌లు లేదా ఇంకెవరైనా ప్రోత్సాహంతో రాణిస్తున్నారే తప్ప ప్రభుత్వ తోడ్పాటు, ప్రోత్సాహం కరువవుతున్నాయి. క్రీడలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు, క్రీడాకారులు రాణించడానికి కావలసిన ప్రోత్సాహం ప్రభుత్వాల నుంచి రావాలి. వారిని రంగం మీద నిలిపి గెలుపు సాధించేలా చూడాలి. హర్మన్ ప్రీత్ కౌర్ నేతృత్వంలో జగజ్జేతగా నిలిచిన టీమిండియా ఆకాశంలో సగం అన్నింటా సగం అన్న స్ఫూర్తితో అమ్మాయిలు క్రికెట్ సహా అన్ని రంగాల్లో స్వర్ణ దీప్తులు నింపేందుకు స్ఫూర్తినిస్తుంది.

## రాష్ట్రంలో వైద్యం ప్రైవేటీకరణ : అవినాష్ రెడ్డి




**కడప, పతాకం న్యూస్:** రాష్ట్రంలో వైద్యాన్ని ప్రైవేటీకరణ చేసే దిశగా ప్రభుత్వం ఉందని, పులివెందుల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో అత్యాధునిక పరికరాల తరలింపు ఆపాలని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని మెడికల్ కళాశాల ప్రారంభ సమయంలో అత్యాధునికమైన పరికరాలను సమకూర్చడం జరిగింది అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ సీట్లను వెనక్కి పంపడమే తప్ప కాకుండా, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లోని పరికరాలను గుంటూరు, కర్నూలకు తరలించడం జరుగుతుంది అన్నారు. ప్రజలు ప్రైవేటీకరణ ఆపాలని నిరసనలు చేస్తుంటే కూటమి ప్రభుత్వం మాత్రం కక్ష ధోరణిలో వెళుతుంది అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంగన్వాడి, రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ లను తొలగించాలన్నారు. వైసిపి నాయకులపై అరాచకాలు చేస్తూ, అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లాలోని టిడిపి నాయకులు ఈ ప్రాంతానికి అన్యాయం జరగకుండా అడ్డుకోవాలన్నారు. ప్రభుత్వ ధోరణి మారకపోతే వైసిపి పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ మనోహర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైసీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

## బీజేపీలో బీఆర్ఎస్ విలీనమయ్యే పరిస్థితి ఉంది: రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** బీజేపీలో బీఆర్ఎస్ విలీనమయ్యే అవకాశం ఉందని, ఈ విషయాన్ని గతంలో కల్వకుంట్ల కవిత చెప్పారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ బీజేపీకి తాకట్టు పెట్టారని ఆయన విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు బుధవారం ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత్ జోడో యాత్ర ద్వారా దేశంలోని మైనారిటీలకు రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారని అన్నారు. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించి 3 నెలలైనా స్పందించలేదని విమర్శించారు. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ ఇంకా అనుమతి ఇవ్వలేదని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించారు.

## రామ్ కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షా శిబిరం

**గాజువాక, పతాకం న్యూస్:** రామ్ కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ మరియు విశాఖ ఐ హాస్పిటల్ సహకారంతో, రెండు రోజుల పాటు ట్రక్కు డ్రైవర్ల కోసం ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించబడింది. ఈ రెండు రోజుల కార్యక్రమంలో మొత్తం 101 మంది ట్రక్కు డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకున్నారు.వారిలో 23 మందికి కళ్ళద్దాలు అవసరపడగా , 8 మందిని మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా.సుమతి, డా.రాము (ఆప్తమాలజిస్టులు) విశాఖ ఐ హాస్పిటల్ నుండి పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా ట్రక్కు డ్రైవర్లలో కంటి ఆరోగ్యం, రోడ్డు భద్రతపై అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో రామ్ కీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డా. కె.శ్రీకాంత్ డ్రైవర్స్ ను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రైవర్ లో ఉన్న దృష్టిలోపం యాక్సిడెంట్లకు కారణమవుతాయని, దీనిని నివారించాలనే ఉద్దేశంతో రామ్ కీ ఫౌండేషన్ ప్రత్యేకంగా హెవీ వెహికల్ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని, రామ్ కీ ఫౌండేషన్ నిర్వహించిన ఈ కంటి పరీక్షల క్యాంపును సద్వినియోగపరుచుకొని దృష్టిలోపాన్ని సర్దించుకోవాలని కోరారు. కంటి పరీక్ష శిబిరంలో కంటి పరీక్షలు చేయడమే కాకుండా అవసరమైన వారికి ఉచిత కళ్లద్దాలు అందజేస్తూ ఉచితంగా ఆపరేషన్ కూడా చేయదలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఐ హాస్పిటల్ ప్రోగ్రాం మేనేజర్ సాయి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.




## పజల ప్రాణాలంటే చంద్రబాబుకు లెక్కలేదా?: బొత్స

(మొదటిపేజీ తరువాయి)

"ఎక్కువ మంది భక్తులు వస్తారని అంచనా వేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? ప్రజల ప్రాణాలంటే చంద్రబాబుకు లెక్కలేదా?" అని నిలదీశారు. తిరుపతి, సింహాచలం ఘటనల నుంచి ప్రభుత్వం ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడిన ప్రతిసారీ ఏదో ఒక అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మరల్చడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని బొత్స ఆరోపించారు. నకిలీ మద్యం కేసులో టీడీపీ నేత జయచంద్రారెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గతంలో డ్రగ్స్ కేసులోనూ టీడీపీ నేతలను వదిలేశారని గుర్తుచేశారు. ఇదే సమయంలో ఎల్లో మీడియాను చూస్తుంటే నవ్వాలో, ఏడవాలో అర్థం కావడం లేదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. భోగాపురం విమానాశ్రయం విషయంలో నిర్మాణానికి అవసరమైన అప్రోచ్ రోడ్లు, ఇతర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. రైతులు, వైద్యం, విద్య, భక్తుల భద్రత వంటి ఏ అంశంలోనూ ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బొత్స విమర్శించారు.

## డబ్బులకు టికెట్లు అమ్ముకునే సంస్కృతి టీడీపీది కాదు : మంత్రి టీజీ భరత్



**కర్నూలు, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీకి కానీ టీజీ కుటుంబానికి కానీ డబ్బులకు టికెట్లు అమ్ముకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఈమేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పొరేటర్ ఎన్నికల్లో పార్టీకి డిపాజిట్లు ఇస్తేనే టికెట్లు ఇస్తారన్న పుకార్లపై ఆయన ఘాటుగా స్పందించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఎవ్వరూ నమ్మొద్దని ఆయన తెలిపారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల్లో నమ్మకం పొందిన వారికే టికెట్లు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఇప్పటికే నాలుగైదు సార్లు సమావేశాల్లో నాయకులు, కార్యకర్తలకు స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పినట్లు తెలిపారు. కార్పొరేటర్ టికెట్ ఇచ్చే ముందు సర్వేలు చేయించి అందులో మొదటి స్థానంలో ఉన్న వారికే టికెట్ కేటాయింపు జరుగుతుందన్నారు. కార్పొరేటర్‌గా పోటీ చేసేందుకు అర్హత డబ్బు ఎంత మాత్రం కాదని, ప్రజల మనసు గెలిచిన వారికే టికెట్లు ఇస్తామని, ఇందులో ఎలాంటి మార్పు ఉండదన్నారు. నాయకులు, కార్యకర్తల్లో గందరగోళం సృష్టించేందుకు పనికట్టుకొని ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తుంటారని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు మాటలు నమ్మొద్దని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి టీజీ భరత్ చెప్పారు. నాయకులందరూ ప్రజల సమస్యలు, వార్డులో అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని ప్రకటనలో ఆయన కోరారు.

## తెలుగు తమ్ముళ్లు క్రమశిక్షణతో పని చేయాలి: పల్లా



**అమరావతి, పతాకం న్యూస్:** తెలుగు తమ్ముళ్లు క్రమశిక్షణతో పని చేయాలని తెలుగుదేశం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. నేతలు ఎవరైనా పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఇకపై ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించాలని సూచించారు. బుధవారం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో పల్లా శ్రీనివాసరావు టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు తమ్ముళ్లకి పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు పల్లా శ్రీనివాసరావు. ఈనెల15వ తేదీలోపు గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ కమిటీల వరకు నియామకాలు పూర్తి చేయాలని హుకుం జారీ చేశారు. కూటమి నాయకులతో సఖ్యతగా, సమష్టిగా ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆజ్ఞాపించారు. మంగళగిరి నియోజకవర్గంలో గ్రీవెన్స్‌ని సరిగా ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజా సమస్యలపై సరైన రీతిలో పరిష్కరించి ఉంటే మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రజాదర్బార్ కు నాలుగు వేల మంది ఎందుకు వస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు పల్లా శ్రీనివాసరావు. నారా లోకేష్ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి శుక్రవారం ప్రతి నియోజకవర్గంలో గ్రీవెన్స్ నిర్వహించాలని ఆజ్ఞాపించారు. ఇక అదే రోజు స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. నవంబరు 15వ తేదీలోపు నియోజకవర్గ కమిటీల నుంచి గ్రామస్థాయి కమిటీల వరకు పార్టీ నియామకాలు పూర్తి చేయాలని డెడ్ లైన్ విధించారు. 15వ తేదీలోపు నియామకాలు పూర్తి చేయలని హుకుం జారీ చేశారు.

## రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

అనుమతించకుండా కార్యాలయం గేట్లు మూసేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి విచ్చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. తమ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తనిఖీ చేస్తున్నామని ఏసీబీ అధికారులు వివరించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. కార్యాలయం తలుపులు మూసేసి సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారించారు. కార్యాలయంలోనికి ఎవరినీ అనుమతించ లేదు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్నట్లు గత కొంతకాలంగా తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు కార్యాలయంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. అధికారుల సోదాలతో అప్రమత్తమైన డాక్యుమెంట్ రైటర్లు తమ షాపులకు తాళం వేసుకుని పరారయ్యారు. గతంలోనూ రాజంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు.పల్నాడు జిల్లా నరసరావుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దస్తావేజుల తనిఖీలు చేపట్టారు. దీంతో సబ్ రిజిస్ట్రేషన్ వద్దనున్న నోటరీ, దస్తావేజుల రైటర్లు కార్యాలయాలు మూసివేశారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అనిశా అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. కార్యాలయానికి తలుపులు వేసి పలు రికార్డులు పరిశీలించారు. ఆ సమయంలో సబ్ రిజిస్టర్ సెలవులో ఉన్నారు. కార్యాలయంలోని పలు కీలక ఫైళ్లు స్వాధీనం చేసుకున్నారు. అనిశా అధికారులు సిబ్బందిని పిలిచి పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు.

## విమానాశ్రయ పనులను సమీక్షించిన రామ్మోహన్ నాయుడు

(మొదటిపేజీ తరువాయి)

విశాఖపట్నం 14, 15తేదీల్లో జరగబోయే ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ లో భోగాపురం ఎయిర్పోర్ట్ ను ప్రమోట్ చేస్తామని, ప్రయాణికుల కోసం స్టార్ హోటల్స్ ను ఆహ్వానిస్తున్నామని ఇప్పటికే సన్ రే రిసార్ట్ ఉండగా ఓబే రాయ్, మే ఫేర్ హోటల్స్ నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. ఎయిర్పోర్ట్ ప్రారంబోత్సవానికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ ని తీసుకు వచ్చేందు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నాలు చేస్తున్నారని తెలియజేశారు. ఇప్పటివరకు 91.7 శాతం పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. డిసెంబర్ లో ఈ ఎయిర్పోర్ట్ నుండి మొదటి ఫ్లైట్ టెస్టింగ్ చేస్తామని అన్నారు. యువతను దృష్టి లో పెట్టుకొని ఏవియేషన్ యూనివర్సిటీ స్థాపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ శ్యామ్ సుందర్ రెడ్డి , రామరాజు తదితర అధికారులు పర్యటనలో పాల్గొన్నారు.

# పుత్తడి గైరంపేటలో ఘనంగా మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమం



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలంలోని పుత్తడి గైరంపేట గ్రామపంచాయతీ పరిధిలో వెలుగు సంస్థ ఆధ్వర్యంలో మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించబడింది.కార్యక్రమంలో వెలుగు ప్రతినిధులు స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు, నిధుల వినియోగం, లెక్కల పారదర్శకతపై వివరించారు.అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రజల్లో ఆర్థిక పారదర్శకత, మహిళా సంఘాల బలోపేతం, మరియు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో 20 డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొని, సంఘాల ఆర్థిక నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ,గొలుగొండ మండలం టీడీపీ ప్రధాన కార్యదర్శి ఆర్.పి.నాయుడు,మాజీ సర్పంచ్ పత్తి సత్తిబాబు, తుమ్మగుంటా అప్పలనాయుడు, వెలుగు సీఏ ముంత వరహాలురావు పాల్గొన్నారు.

# టెన్త్, ఇంటర్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

### కలెక్టర్ విజయకృష్ణన్



**అనకాపల్లి, పతాకం న్యూస్:** పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖలు, కేజీబీవీ, విద్యా శాఖ అధికారులు, వసతిగృహాల సంక్షేమ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానంగా గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాల మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలు, పరీక్షల ముందస్తు ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. చదవటం, రాయటంపై నిత్యం తర్ఫీదు చేయాలని, మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహించాలని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పరీక్షలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థులు.. స్కూళ్లు తెరిచిన రోజే తిరిగి వచ్చేలా చూడాలని, అందుకు వసతిగృహ అధికారులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. వసతిగృహాల పరిసరాలు పరిశుభ్రంగా వుండాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, తుప్పలు వుంటే తొలగించాలని, కుక్కలు లోనికి రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. వసతిగృహం నుంచి పాఠశాలకు విద్యార్థుల రాకపై రోజూ సంబంధిత ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని, విద్యార్థులపై నిత్య పర్యవేక్షణ వుండాలని స్పష్టం చేశారు. బాలికల వసతిగృహాల్లోకి సిబ్బంది తప్ప ఇతరులను అనుమతించవద్దన్నారు. విద్యార్థులకు రక్షిత మంచినీరు, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఇటీవల సంభవించిన తుఫాన్‌కు భవనాలు దెబ్బతింటే వెంటనే బాగు చేయించాలని తెలిపారు. సమావేశానికి డీఈవో జి.అప్పారావునాయుడు, బీసీ సంక్షేమ అధికారి కె.శ్రీదేవి, సాంఘిక సంక్షేమ అధికారి బి.రామనా?థం, తదితరులు హాజరయ్యారు.

# కంద్రం పంచాయతీలో గంజాయి పరివర్తన కార్యక్రమం



**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని బుధవారం కంద్రుం పంచాయతీలో గంజాయి పరివర్తన కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ప్రత్యామ్నాయ పంటల ప్రచారం,గ్రామీణులకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి, డుంబ్రిగూడ ఎస్ఐ పాపి నాయుడు, సర్పంచ్ హరి, ఎంపీటీసీ ఆనంద్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి మాట్లాడుతూ, గంజాయి సాగు వల్ల వచ్చే ఆర్థిక, సామాజిక సమస్యలను నివారించడానికి ప్రభుత్వం చేపట్టిన చైతన్యం 2025 వంటి కార్యక్రమాలు ముఖ్యమైనవని, ప్రత్యామ్నాయ పంటలు వంటి కాఫీ, జామ, జాక్‌ఫ్రూట్‌లు సాగు చేయడం ద్వారా రైతులు లాభాలు పొందవచ్చని ఆయన అన్నారు.అరకు ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగు తగ్గించడానికి పోలీసు, ఫారెస్ట్, రెవెన్యూ శాఖలు కలిసి పనిచేస్తున్నాయి. ఈ కార్యక్రమం గ్రామీణులలో అవగాహన పెంచడమే కాకుండా, డ్రగ్స్ ను అరికట్టడానికి ఒక అడుగుగా మారింది. ఈ కార్యక్రమంలో ప్రజలు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చింతపల్లి జీకే వీధి ఆర్గానిక్ కాఫీ రైతుల ఆందోళన



**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,చింతపల్లి మండలం పరిధిలోని జీకే వీధి,జి.మాడుగుల, ప్రాంతాలు రాష్ట్రంలో నాణ్యత గల ఆర్గానిక్ కాఫీ పండించే ప్రధాన కేంద్రాలుగా నిలుస్తున్నాయి.అరకు కాఫీతో సమానంగా ప్రసిద్ధి పొందిన చింతపల్లి ఆర్గానిక్ కాఫీ రైతులు ప్రస్తుతం ఆందోళనలో ఉన్నారు.గత ఏడాది జిసిసి (గిరిజన సహకార కార్పొరేషన్) రైతుల వద్ద నుండి కిలోకు రూ.330 ధరకు ఆర్గానిక్ కాఫీని కొనుగోలు చేసిందని,అయితే కొనుగోలు చేసిన స్టాక్ ఇప్పటికీ చింతపల్లి జిసిసి గోదాముల వద్ద నిల్వగా ఉండటంతో,ఈ ఏడాది రైతుల వద్ద నుండి జిసిసి కొనుగోలు చేస్తుందా లేదా అన్న అనుమానం రైతుల్లో నెలకొంది.ఈ నేపథ్యంలో రైతులు ప్రభుత్వాన్ని,జిసిసి అధికారులను వేడుకుంటూ కష్టపడి పండించిన నాణ్యమైన కాఫీని ఈ ఏడాది కూడా జిసిసి ద్వారా కొనుగోలు చేసి, కార్పొరేషన్‌ను లాభదాయక మార్గంలో నడిపించాలి"అని రైతులు కోరుతున్నారు.చింతపల్లి జీకే వీధి, జి.మాడుగుల ప్రాంత రైతులు తమ కాఫీని సకాలంలో సేకరించి, జిసిసి కొనుగోలు చర్యలు తక్షణం ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చింతపల్లి మండలం గ్రంధాల వీధి గ్రామం లో నాణ్యమైన ఆర్గానిక్ కాఫీ చేయకరణ చేస్తున్న కాఫీ రైతు జ్యోతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# రికార్డు స్థాయిలో స్కూల్ గేమ్స్ పోటీలకు సంస్కృతి గ్లోబల్ విద్యార్థులు



**పరవాడ, పతాకం న్యూస్:** జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి క్రీడా పోటీలలో పాల్గొని రికార్డు స్థాయిలో ఒకే విద్యాసంస్థ నుండి అత్యధికంగా రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆర్చరీ, బాక్సింగ్, బాడ్మింటన్, బేస్ బాల్, చెస్, మోడరన్ పెంటాథ్లాన్, షూటింగ్, స్విమ్మింగ్, సాఫ్ట్ బాల్, వుషు క్రీడలలో ప్రతిభ కనబర్చి ఎంపికైన 65 మంది అండర్ 19, 17, 14 సంస్కృతి గ్లోబల్ స్కూల్ క్రీడాకారులను సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి అభినందనలు తెలిపారు. ఈ క్రీడాకారులతో పాటు ఈ క్రీడలలో శిక్షణ ఇచ్చిన నిష్ణాతులైన క్రీడాశిక్షకులు గోవింద్, శివకుమార్, హరినాథ్ రెడ్డి, రాజేష్ కుమార్, రామ్మోహన్, లోహిత్, రమ్య, నవీన్, దినేష్, అమర్నాథ్, అన్నపూర్ణ లను పాఠశాల సీ ఈ ఓకె. నిశాంత్ అభినందనలు తెలుపుతూ జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు.

# పేదలకు పెన్నిధి

## సీఎం సహాయ నిధి: గణబాబు



**గోపాలపట్నం, పతాకం న్యూస్:** సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని ప్రభుత్వ విప్ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని సీ.ఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు 63.59.60, 57 వార్డులోబి గణబాబు చెక్కులను పంపిణీ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీ.ఎం రిలీఫ్ ఫండ్ ని సద్వినియోగపరచుకోవాలని తెలియజేశారు . పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీ.ఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామని గణబాబు అన్నారు . ఈ నేపథ్యంలో పేదలకు చెందిన పట్నాల గోవిందు- రూ.71,664/-, 57వార్డ్ సురకత్తుల జ్యోతి- రూ. 25,000/-, 63 వార్డ్. రామస్వామిఉమాపతి- రూ.74,605/-, 58 వార్డ్. గీసాల అప్పలరాజు- రూ.55,180/-, 57వార్డ్ బొల్లప్రగడ త్రినాధ రావు- రూ.1,57,978/-, 58 వార్డ్ డోక్లా ధనుశ్రీ కేరాఫ్ రామలక్ష్మి- రూ.30,000/-, 59 వార్డ్, పిళ్ళిచాతుర్య- రూ.20,000/-, 57వార్డ్ దంద్రురమేష్- రూ.52,660/-, 58 వార్డ్. చెక్కులను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు అందజేశారు. చెక్కులు అందుకున్న వారు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన గణబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ అంగ దుర్గా ప్రశాంతి, 63 కార్పొరేటర్ గల్లా చిన్న, శిరం. ఉమా మహేశ్వరి, రామ్మోహన్ నాయుడు,పోతబత్తుల శ్రీను, 57వార్డ్ అధ్యక్షుడు పెంటకోట అజయ్, 57వార్డ్ కార్పొరేటర్ మురు వాణి, టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పక్కా ఇళ్లు

## పీఎంఏవై-జీ కింద మంజూరుకు కేంద్ర గ్రీన్ సిగ్నల్



**అనకాపల్లి, పతాకం న్యూస్:** పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇల్లు లేని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన- గ్రామీణ (పీఎంఏవై-జీ) కింద పక్కా ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తున్నది. ఇంతవరకు సుమారు 16 వేల దరఖాస్తులు అందాయి. బుధవారంతో గడువు ముగియనున్నది. ఇళ్లు లేని పేదలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సర్వే ద్వారా గుర్తించింది. జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారులు జిల్లాలో సొంత ఇల్లు లేని వారి వివరాలను ప్రభుత్వానికి సమర్పించారు. ఈ జాబితాను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అందజేసింది. పీఎంఏవైజీ 2.0 కింద పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు కేంద్రం ఆమోదం తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వం సొంత స్థలం ఉన్న పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. అర్హులైన వారు ఈ నెల 5వ తేదీలోగా సమీపంలోని గ్రామ/ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం గత నెలలో ప్రకటించింది. దరఖాస్తుదారులకు సొంత స్థలం ఉండాలి. దీనికి సంబంధించి డాక్యుమెంట్/డి.పట్టా/పొసెషన్ సర్టిఫికెట్లలో ఏదో ఒకటి తప్పనిసరిగా వుండాలి. దీంతోపాటు బియ్యం కార్డు, కుల ధ్రువీకరణపత్రం, భార్యాభర్తలు ఆధార్ జెరాక్స్ కాపీలతో సచివాలయానికి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.

సొంత ఇంటి మంజూరుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 5వ తేదీ వరకే గడువు వుంది. పట్టణాల్లో యూనిట్ ధర (ఒక ఇల్లు) రూ.2.8 లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ.1.59 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా ఇంతవరకు 16,.029 దరఖాస్తులు అందాయి. వీటిలో 464 దరఖాస్తులు పట్టణ, 15,506 దరఖాస్తులు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చాయి. పాయకరావుపేట నియోజకవర్గం నుంచి అత్యధికంగా 3,863 మంది, పెందుర్తి నియోజకవర్గం నుంచి తక్కువగా 301 దరఖాస్తులు అందాయి. అనకాపల్లి నుంచి 2,051, మాడుగుల నుంచి 3,258, నర్సీపట్నం నుంచి 1,306, ఎలమంచిలి నుంచి 2,273 దరఖాస్తులు వచ్చాయి. కాగా భవన నిర్మాణ సామగ్రి, కూలి రేట్లు పెరిగినందున గ్రామాల్లో కూడా ఒక్కో ఇంటికి రూ.2.8 లక్షల చొప్పున మంజూరు చేయాలని గ్రామీణ లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి లేఖ రాసినట్టు గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు తెలిపారు. పక్కా ఇంటి కోసం దరఖాస్తు చేసుకునే గడువు బుధవారంతో ముగుస్తుందని చెప్పారు.

# ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాల రాష్ట్రస్థాయి కళా ఉత్సవాల్లో చింతపల్లి ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ



**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా చింతపల్లిప్రతి ఏడాదికి ఒకసారి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాల రాష్ట్రస్థాయి పోటీలు కళా ఉత్సవాలు మారేడుమిల్లిలో చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాలు మూడు మూడవ తారీకు నుంచి 4 వరకు నిర్వహించడం జరిగింది రాష్ట్రంలో ఉన్నటువంటి 28 ఏకలవ్య పాఠశాలల విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలలో ప్రతిభను కనబరిచారు చింతపల్లి ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాలకు సంబంధించిన పలు విద్యార్థులు పలు కార్యక్రమాల్లో మొదట ద్వితీయ తృతీయ స్థానాలు కైవసం చేసుకోవడం జరిగింది వోకల్ మ్యూజిక్ క్లాసికల్ సీనియర్ విభాగంలో ఎం రేణుక మొదటి స్థానం ట్రైబల్ పెయింటింగ్ లో కె విజయ్ కుమార్ 8వ తరగతి మొదటి స్థానం లో రీజనల్ ట్రైబల్ గ్రూప్ డాన్స్ లో ద్వితీయ బహుమతి రవీంద్ర ప్రేమ చరన్. వివేక్ లిఖిత్ కుమార్ అభిరామ్. ఫోక్ డాన్స్ లో స్వప్న. స్మైలీ. చందన.జాహ్నవి. కు ద్వితీయ బహుమతి ట్రైబల్ గ్రూప్ డాన్స్ విభాగంలో జూనియర్స్ తృతీయ బహుమతి ట్రైబల్ స్టోరీ టెల్లింగ్ లో సెకండ్ ర్యాంకు ఎం హారిక వి ఆనంద్ ఇంగ్లీష్ స్టోరీ స్పెల్లింగ్ జూనియర్ విభాగంలో ద్వితీయ బహుమతి వర్షిత ఇంగ్లీష్ డిబేట్ సీనియర్ విభాగంలో తృతీయ బహుమతి కే దీనకుమారి విభాగాలలో రాష్ట్రస్థాయిలోనే పాల్గొని వివిధ విభాగాలలో మంచి స్థానాలు సాధించిన విద్యార్థులని ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ విభాగాలలో రాష్ట్రస్థాయిలోనే పాల్గొని వివిధ విభాగాలలో మంచి స్థానాలు సాధించిన విద్యార్థులని ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ మరియు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థుల అభినందించారు అభినందించారు మారేడు మిల్లిలో ఈ కార్యక్రమానికి తెలుగు ఉపాధ్యాయుడు లోవరాజు హిందీ ఉపాధ్యాయుడు బద్రి ప్రసాద్ సైన్సు లావణ్య సరస్వతి ఆర్టు రుచి అగర్వాల్ పాల్గొనడం జరిగింది


# ఘనంగా ప్రధాని జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమం



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలం పాతమల్లంపేట గ్రామపంచాయతీ పరిధిలోని నిమ్మగెడ్డ గదబపాలెం గ్రామంలో బుధవారం ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా గొలుగొండ డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాస్ హాజరై ప్రభుత్వ పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.సర్పంచ్ ఆదిలక్ష్మి ఆదివాసీ ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నదే తమ లక్ష్యమని ఆమె తెలిపారు.గ్రామ ప్రజలు ఈ కార్యక్రమానికి ఉత్సాహంగా హాజరై మంచి స్పందన చూపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు గెడ్డం ఆనంద్, నీలాపు చంద్రరావు,సచివాలయ సిబ్బంది,వార్డ్ సభ్యులు,స్థానిక పీవీటీజీ ఆదివాసీలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నాణ్యతలేని రా మెటీరియల్!

### పథకం ప్రకారం 'ఉక్కు'ను నష్టపరుస్తున్న కేంద్రం




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం పథకం ప్రకారం నష్టపరుస్తూ మూసివేత దిశగా తీసుకెళ్తోంది. అయినప్పటికీ రాష్ట్రంలోని టిడిపి కూటమి నేతలు 'ఇదిగో ఆర్థిక ప్యాకేజీ తెచ్చేశాం.. అదిగో ఉక్కు సామర్థ్యాన్ని పెంచేశాం' అంటూ రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారు. స్టీల్‌ప్లాంట్‌లో వాస్తవికతను తెలుసుకునేందుకు సైతం ప్రభుత్వం సుముఖంగా లేదు. ప్రస్తుతం ప్లాంట్‌లోని ఉన్నతాధికారులు (యాజమాన్యం) నాణ్యత లేని రా మెటీరియల్ ఐరన్ ఓర్, కోక్, లైమ్ స్టోన్‌ను కొనడం, వాటినే ఉత్పత్తిలో వాడడం వల్ల ప్లాంట్‌లో 18230 టన్నులకు సమానమైన 4,779 ఇనుప దూలాలు (బ్లూమ్స్) బహిరంగ మార్కెట్లో తిరస్కరణకు గురయ్యాయి. ఒక్కో బ్లూమ్ 3.87 టన్నులు ఉంటుంది. రా మెటీరియల్ కొనుగోలులో యాజమాన్యం సక్రమంగా వ్యవహరించడం లేదన్న అంశాన్ని గడిచిన నాలుగు నెలలుగా కిందిస్థాయి అధికారులు, కార్మికులు పదేపదే ఉన్నతాధికారులకు చెబుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. టోటల్ మెయింటినెన్స్ కాంట్రాక్టు (టిఎంసి) పేరుతో రా మెటీరియల్ హేండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పి), సింటర్ ప్లాంట్, కోకో-1, బ్లాస్ట్ ఫర్నేస్‌ల విభాగాల్లో గడిచిన నాలుగు నెలలుగా సామర్థ్యం పడిపోయే రీతిలో కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం కలిసి చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలోనే హెచ్‌ఒడిలను ఒకచోట నుంచి మరో చోటకు మార్చుతున్నారు. ఆర్ఎంహెచ్‌పిలో పదుల సంఖ్యలో నైపుణ్యంగల వర్కర్లకు విఆర్ఎస్ ఇచ్చేసి బయటకు పంపేశారు. టిఎంసిల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో కన్వేయర్లు, టిప్పర్‌లు, యార్డు స్టాక్ పాయింట్ నుంచి తెచ్చే స్టాకర్, ఐరన్ ఓర్ కోల్‌ను డిపార్టుమెంట్లకు తరలించే రిక్లెయిమర్‌లన్నింటికి నష్టం వచ్చినట్లు కార్మికులు చెబుతున్నారు. ప్లాంట్‌లో 29 డిపార్టుమెంట్లు ఉండగా వేర్వేరు చోట్ల 36 ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఇఒఐ)లను ఇప్పటి వరకూ పిలిచారు. ఇప్పుడు ఉత్పత్తి ఫెయిల్ (డామేజ్) జరిగిన విభాగాల్లో కూడా 2026 జనవరి నుంచి ఇఒఐలను పిలిచేందుకు కేంద్రం ఆదేశాలతో యాజమాన్యం రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఆర్ఎంహెచ్‌పిని పూర్తి స్థాయిలో నడపలేకపోవడంతో బ్లాస్ట్ ఫర్నేస్ ఉత్పత్తి తగ్గించాల్సి వచ్చింది. సింటర్ ప్లాంట్, కోకో-1లోనూ ప్రస్తుతం ఉత్పత్తిని తగ్గించేశారు. మరికొద్ది రోజుల్లో ప్లాంట్ మొత్తంగా ఉత్పత్తి తగ్గించే పరిస్థితి ఏర్పడనుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రా మెటీరియల్స్ అన్నీ ప్లాంట్‌లోనే తయారు చేసేవారు. ప్రస్తుతం కోక్ బయట నుంచి కొనుగోలు చేస్తున్నందున అందులో సల్ఫర్ కంటెంట్ అధికంగా ఉంటోంది. దీంతో, బ్లాస్ట్ ఫర్నేస్‌లలో ఉత్పత్తి నాణ్యతగా రాకపోవడంతో ఎస్ఎంఎస్ -1లో కన్వర్టర్-2 పూర్తిగా షట్‌డౌన్ అయిపోయింది. రా మెటీరియల్ నాణ్యతగా లేనందున కన్వర్టర్-3 రెండు రోజుల క్రితం అగ్నిప్రమాదానికి గురైంది. ఉత్పత్తి తగ్గి రిజెక్ట్ అయిన బ్లూమ్స్ 18,230 టన్నులు ప్లాంట్ బ్లూమ్ యార్డులో వృథాగా ఉన్నాయి. ఆర్ఎంహెచ్‌పి, సింటర్ ప్లాంట్ రెండింటినీ టిఎంసికి ఇచ్చారు. ఆ రెండు విభాగాలు రా మెటీరియల్‌ను సక్రమంగా ఇవ్వలేకపోవడంతో ఉత్పత్తి దెబ్బతింటోంది.

# నేడు బీహార్ తొలి దశ ఎన్నికల పోలింగ్



**బీహార్:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన తొలి దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గురువారం 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో ఓటింగ్ జరగనుంది. ఈ దశలో మొత్తం 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, పలువురు ప్రముఖ నేతల భవితవ్యం తేలనుంది. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగియడంతో అందరి దృష్టి ఇప్పుడు పోలింగ్‌పైనే కేంద్రీకృతమైంది. ముఖ్యంగా హోరాహోరీ పోరు నెలకొన్న కీలక నియోజకవర్గాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కేబినెట్‌లోని 16 మంది మంత్రులు ఈ దశలో తమ స్థానాలను నిలబెట్టుకునేందుకు పోటీ పడుతున్నారు. వీరిలో 11 మంది బీజేపీ కోటాకు చెందినవారు కాగా, ఐదుగురు జేడీ(యూ) మంత్రులు ఉన్నారు. ఈ ఎన్నికలు నితీశ్ ప్రభుత్వ పాలన, విశ్వసనీయతకు ఒకరకంగా అగ్నిపరీక్షగా మారాయి. మరోవైపు, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఆయన సోదరుడు, జనశక్తి జనతాదళ్ అధినేత తేజ్ ప్రతాప్ యాదవ్ కూడా తమ స్థానాల్లో గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారు. ఈ ఎన్నికల్లో పలు నియోజకవర్గాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ముంగేర్ జిల్లాలోని తారాపూర్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడ ఆర్జేడీ అభ్యర్థి అరుణ్ కుమార్ షాతో పాటు, జన్ సురాజ్, జన్ తంత్రిక్ జనతాదళ్ అభ్యర్థులు కూడా బరిలో ఉండటంతో చతుర్ముఖ పోరు నెలకొంది. వైశాలి జిల్లాలోని రాఘోపూర్, తేజస్వి యాదవ్ కుటుంబానికి కంచుకోటగా ఉంది. ఇక్కడ ఆయన ఎన్డీయే అభ్యర్థి సతీశ్ యాదవ్‌ను ఢీకొంటున్నారు.పాట్నా రూరల్ పరిధిలోని మొకామా స్థానం, దులార్‌చంద్ యాదవ్ హత్య కేసు నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడ జేడీ(యూ) నుంచి అనంత్ సింగ్, ఆర్జేడీ నుంచి వీణా దేవి పోటీ పడుతున్నారు. ఇద్దరూ బలమైన రాజకీయ కుటుంబాలకు చెందిన వారు కావడంతో పోరు రసవత్తరంగా మారింది. ఈ ఎన్నికల్లో కళారంగానికి చెందిన ప్రముఖులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ప్రముఖ జానపద గాయని మైథిలి ఠాకూర్‌ను బీజేపీ దర్భంగా జిల్లాలోని అలీనగర్ నుంచి బరిలోకి దించింది. ఆమె ఆర్జేడీ అభ్యర్థి వినోద్ మిశ్రాతో తలపడుతున్నారు. మిథిలాంచల్ ప్రాంతంలో మైథిలికి ఉన్న ప్రజాదరణ ఆమెకు ఎంతవరకు కలిసొస్తుందో చూడాలి. భోజ్‌పురి సూపర్ స్టార్ కేసరి లాల్ యాదవ్ సారన్ జిల్లాలోని ఛాప్రా నుంచి ఆర్జేడీ తరఫున పోటీ చేస్తున్నారు.ఇక, లఖిసరాయ్‌లో ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా కాంగ్రెస్ అభ్యర్థితో తలపడుతూ వరుసగా మూడో విజయంపై కన్నేశారు. బేగుసరాయ్‌లో బీజేపీ అభ్యర్థి కుందన్ కుమార్‌కు, కాంగ్రెస్‌కు చెందిన అమితా భూషణ్‌కు మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ కుల సమీకరణాలు కీలకం కానున్నాయి. పాట్నాలోని పట్టణ నియోజకవర్గమైన బకీపూర్‌లో బీజేపీ నేత నితిన్ నబిన్ మరోసారి పోటీ చేస్తున్నారు.

# చెకుముకి పోటీలలో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేత



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్ :** రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం రంపచోడవరంలో రాజ్యాంగం పై జరిగిన డివిజన్ స్థాయి వ్యాసరచన, డిబేట్, క్విజ్ కాంపిటీషన్స్ పోటీల్లో ప్రథమ,ద్వితీయ,స్థానాలు కైవసం చేసుకున్నారు. చెకుముకి పోటీల్లో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మండల స్థాయిలో ద్వితీయ స్థానం గెలుపొందడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం ఆదిలక్ష్మి తెలిపారు. పాఠశాల ఆవరణలో బుధవారం ప్రధానోపాధ్యాయులు ఎ ఆదిలక్ష్మి , పి ఎం సి చైర్మన్ మరిచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి విజేతలైన పదవ తరగతి చదువుతున్న విద్యార్దులు సి హెచ్ కాంచన శిరి ,ఎ మౌళి, పి తనుశ్రీ, భాను , చెకుముకి మండల స్థాయి విజేతలు కె దుర్గాతేజ, కె చరణ్, ఎన్ వినయ్ ఆదిత్య, జిశివ శంకర్ (9వ తరగతి) లకు వారు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు, తదతరులు పాల్గొన్నారు.

### ఏపీడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో

# వృద్ధులకు అన్నవితరణ



**తెనాలి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గుంటూరు తెనాలిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తెనాలి డివిజన్ ఫెడరేషన్ అధ్యక్షులు అంబటి శ్యామ్ సాగర్, కార్యదర్శి అచ్యుత సాంబశివరావు ఆధ్వర్యంలో ఈరోజు బుర్రిపాలెం రోడ్డులో గల గాంధీ వృద్ధాశ్రమంలో వృద్దులకు అన్నవితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి మాట్లాడుతూ %ో% ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరించే జర్నలిస్టులు ఆశ్రమానికి విరాళం అందించడం ముదావహమన్నారు. 2007 లో ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ పలు శాఖలుగా విస్తరిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఫెడరేషన్ తెనాలి డివిజన్ అధ్యక్షులు అంబటి శ్యామ్ సాగర్ అన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర కమిటి నియమ నిబంధనలకు అనుకూలంగా గ్రూపు సభ్యులు వ్యవహరించడం ఫెడరేషన్ ఐకమత్యాన్ని తెలియజేస్తుందన్నారు. తమ సంపాదనలో పేదలకు కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చించడం సంతృప్తిని కలుగజేస్తుందన్నారు. ఆశ్రమంలో సేదతీరుతున్న వఅద్ధులకు ఆకలిదప్పులు తీరుస్తున్న ఆశ్రమ నిర్వాహకులను అభినందించారు. ఈకార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు కనపర్తి రత్నాకర్, ఫెడరేషన్ గౌరవ సభ్యులు ఎస్ఎస్ జహీర్, కరేటి సాంబశివరావు, దేవరపల్లి నాగరాజు, చింత మణి, ఉన్నం భూషణం, నాగ మల్లేశ్వరరావు, కోడూరి నాగరాజు, శ్రీరామ్ సుభాష్, మాలేపాటి తిరుమలేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

### మంగినపూడి బీచ్‌ను పర్యాటకంగా

# అభివృద్ధి చేస్తాం: మంత్రి కొల్లు



**మచిలీపట్నం, పతాకం న్యూస్:** గమంగినపూడి బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్లో సాగర సుప్రభాత హారతితో సముద్ర స్నానాలను ఆయన ప్రారంభించారు. వేదపండితులు విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ ఘనాపాటి ఆధ్వర్యంలో సముద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సముద్ర స్నానం ఆచరించారు. మచిలీపట్నంలో సముద్ర స్నానాలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు. లక్ష మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు. సాగర హారతితో ఓ చక్కటి సంప్రదాయానికి శ్రీకారం చుట్టామన్నారు. తీర ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు.

# బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్: ముగ్గురు మావోస్టులు మృతి

**ఛత్తీస్‌ఘడ్:** ఛత్తీస్‌ఘఢ్‌లోని బీజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. బీజాపూర్‌లోని అనారం, మర్రిమల్ అడవుల్లో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులను సైనికులు హతమార్చారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ముగ్గురు నక్సల్స్ మృతదేహాలను, ఘటనా స్థలం నుంచి భారీ సంఖ్యలో ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని ఎస్పీ పేర్కొన్నారు.

# నిద్రావస్థలో పవన్: బోడె



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని సమస్యలపై తనకు సంబంధం ఉందోలేదో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ప్రజలకు స్పష్టం చేయాలని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏఘటన జరిగినా నగరం కాలిపోతుంటే రోమ్ చక్రవర్తి ఫిడేలు వాయించిన చందంగా పవన్‌కళ్యాణ్ ఉన్నారన్నారు. పలాస కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక ఏకాదశి సందర్భంగా తొక్కిసలాట జరిగి 9 మంది మరణించడం.. 18 మంది గాయపడడం బాధాకరమన్నారు. క్షతగాత్రులు, మృతుల బంధువులను పరామర్శించేందుకు ఆయన పలాస కాశీబుగ్గకు వచ్చారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.50వేలు, గాయాలతో చికిత్స పొందుతున్న వారికి రూ.10వేల చొప్పున సాయాన్ని అందించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో విలేకర్లతో మాట్లాడారు. మహిళలపై దాడులు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ఏం సంబంధం లేనట్లు పవన్ కళ్యాణ్ నిద్రావస్థలో ఉన్నారని విమర్శించారు. ఆయనకు అధికారం లేకున్నా కేవలం ఉత్సవ విగ్రహం లాంటి పదవులు ఉన్నాయన్నారు. పలాస ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం ప్రైవేటు ఆలయమని తప్పించునే ప్రయత్నం చేయడం తగదన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థలు, పరిశ్రమలు, ఆసుపత్రుల్లో ఇలాంటి ఘటనలు జరిగితే తమకు సంబంధం లేదని ప్రకటనలు ఇస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిఘా, పోలీసు వ్యవస్థను రాజకీయాలకు వినియోగించుకుంటున్నారని ఆరోపించారు.

# వెలుగు సీఏ శ్రీరామ్‌మూర్తి కన్నుమూత



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలం జమ్మాదేవిపేట గ్రామానికి చెందిన వెలుగు సొసైటీ సీఏగా పనిచేస్తూ,గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీరామ్‌మూర్తి బుధవారం మృతిచెందారు. పప్పుశెట్టిపాలెం పంచాయితీ శివారు జమ్మాదేవిపేట గ్రామానికి చెందిన ఆయన మరణవార్త తెలిసి కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెలుగు సొసైటీల ఆర్థిక వ్యవహారాల్లో శ్రీరామ్‌మూర్తి సేవలు మరువలేనివిగా నిలిచిపోతాయని సహోద్యోగులు, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు గుర్తుకు తెచ్చుకుంటున్నారు.అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ వర్గాలు తెలిపాయి

# శ్రమదానంతో రోడ్డు పనులు చేస్తున్న ఆదివాసి గిరిజనులు



**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం తమ్మింగుల పంచాయతీ వెదురుపల్లి, చిట్టం గరువు గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి మరియు గ్రామస్తులతో నిరసన చేస్తూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి మాట్లాడుతూ చింతపల్లి మండలం తమెంగుల పంచాయతీ కి చెందిన వెదురుపల్లి, చిట్టం గరువు గ్రామాలకు ఐదు కిలోమీటర్లు తారు రోడ్డు మంజూరు చేయాలని సరైన రోడ్డు లేక ఆ రెండు గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు వర్షాలు పడితే మట్టి రోడ్డు కావడంతో ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం తరఫున జన్మన్ హౌసింగ్ సాంక్షన్ అయినప్పటికీ ఇల్లు కట్టుకోవటానికి కావలసిన మెటీరియల్ తెచ్చుకోవాలంటే చాలా ఇబ్బందులు పడవలసి వస్తుందని ఆ గ్రామంలో ఉన్నటువంటి ఇల్ల పనులు పూర్తి చేసుకోలేక పోతున్నారని మండిపడ్డారు. ఆ గ్రామంలో అనారోగ్యం తో బాధపడుతున్న వారికి సకాలంలో మెరుగైన వైద్యం పొందలేక చాలామంది చనిపోయినటువంటి పరిస్థితి ఉంది. 2021 లో ఒక గర్భిణీ స్త్రీ గేమ్మెల దివ్య పురిటి నొప్పులతో బాధపడుతూ సకాలంలో వైద్యం అందించడానికి అంబులెన్స్ కు ఫోన్ చేసినప్పటికీ అంబులెన్స్ రాక వైద్య మందక మృతి చెందిందని ఈ మధ్యకాలంలో వర్షాలు బాగా పడడంతో ఎక్కడబడితే అక్కడ గుంతలు గుంతలుగా ఏర్పడడంతో గ్రామస్తులందరూ సమావేశం ఏర్పాటు చేసి ఒక తీర్మానం పెట్టి శ్రమ దానం తో రోడ్డు పనులు చేస్తున్నారన్నారు.

## చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనపై రవాణా శాఖ కార్యదర్శికి హెచ్ఆర్‌సి నోటీసులు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర మానవహక్కుల కమిషన్ స్పందించింది. ఈ ఘటనను సుమోటోగా తీసుకున్న కమిషన్.. డిసెంబర్ 15 లోపు నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు రవాణా శాఖ, హెూంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు మంగళవారం నోటీసులు ఇచ్చింది. జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్‌టిసి ఎండిలను నివేదిక పంపాలని ఆదేశించింది. సోమవారం ఉదయం మీర్జాగూడ గేటు వద్ద ఆర్‌టిసి బస్సును టిప్పర్ ఢ కొన్న ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోగా 24 మందికి గాయాలైన సంగతి తెలిసిందే.

## ప్రాణాలు తోడేస్తున్న విద్యాసంస్థలు

### నలుగురు విద్యార్థులు ఆత్మహత్య



**అమరావతి, పతాకం న్యూస్:** ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల ప్రాణాలను తోడేస్తున్నారు. రాష్ట్రంలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. చదువు ఒత్తిడిని తట్టుకోలేక కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరు, యాజమాన్య వేధింపుల వల్ల చిత్తూరు జిల్లాలో ఒకరు, ఫీజు చెల్లించాలనే ఒత్తిడి వల్ల తిరుపతి జిల్లాలో ఒకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబసభ్యుల కథనం ప్రకారం చిత్తూరు నగరంలోని సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అదే నగరంలోని సంజరుగాంధీ కాలనీకి చెందిన రుద్రమూర్తి (19) బిటెక్ డేటా సైన్స్ రెండో సంవత్సరం చదువుతున్నారు. కళాశాల భవనంలోని మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. యాజమాన్యం వేధింపుల కారణంగానే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడంటూ మృతుని తల్లి తులసి, బంధువులు, స్నేహితులు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, కళాశాల హెచ్ఓడి సమాధానం చెప్పాలని కోరుతూ కళాశాల ఎదుట బైఠాయించారు. సిఐ నిత్యాబాబు, పూతలపట్టు సిఐ కత్తి శ్రీనివాసులు అక్కడికి చేసుకొని సిసి ఫుటేజ్ ఇస్తామని, విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, ఇదే కళాశాలకు చెందిన బిటెక్ మూడో సంవత్సరం విద్యార్థిని కూడా ఇదే కారణంతో వారం రోజుల క్రితం కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఆమె తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. తిరుపతి-రేణిగుంట మార్గంలోగల చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్‌సి బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సాయి చందు (20) కళాశాల హాస్టల్ భవనంపై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కళాశాల ఫీజు కట్టాలని, ఆ విద్యార్థి నెల్లూరు జిల్లా స్టోన్‌హౌస్‌పేటలో ఉంటున్న తన తండ్రి శ్రీనివాసులుకు ఫోన్ చేశారు. దీంతో, శ్రీనివాసులు హాస్టల్ గదికి వెళ్లగా, అక్కడ తన కుమారుడు కనిపించపోవడంతో అతని స్నేహితుడిని అడిగారు. మిద్దెపైకి వెళ్లాడని చెప్పడంతో అక్కడికి వెళ్లి చూడగా చందు ఉరి వేసుకుని ఉండడానికి గుర్తించి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరు పంచాయతీ సీతయ్యపేటకు చెందిన కోండ్రు కార్తీక్ (15) తునిలోని ఓ ప్రయివేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. పాఠశాలకు చెందిన హాస్టల్‌లోనే ఉంటూ తరగతులకు హాజరవుతున్నారు. స్టడీ రూములో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన యాళ్ల సత్యదేవ్‌కుమార్ (18) తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక ప్రయివేటు విద్యా సంస్థలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల ఆ విద్యార్థి తన ఇంటికి వెళ్లారు. సత్యదేవ్‌ను ఆయన తండ్రి ప్రసాద్ కళాశాలలో దింపి ఇంటికి వెళ్లారు. అంతలోనే కాలేజీలో సత్యదేవ్‌కుమార్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు కాలేజీ యాజమాన్యం నుంచి ఆయనకు ఫోన్ వచ్చింది. ఈ ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యకు చదువు ఒత్తిడే కారణమని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

## మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



**కర్నూలు జిల్లా, పతాకం న్యూస్:** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని కలెక్టర్ డా.ఎ.సిరి సూచించారు. ఆమె పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను, వంటగదిలో భోజన తయారీని పరిశీలించారు. వారంలో ఎన్నిసార్లు చికెన్, గుడ్డు ఇస్తున్నారని హాస్టల్ వార్డెన్ శిరీషను అడిగి తెలుసుకొన్నారు. వంట సరుకుల వివరాలు రికార్డులో పొందుపరచాలని సూచంచారు. హాస్టల్ గది పైకప్పు పెచ్చులూడుతోందని వార్డెన్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ మరమ్మతులకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. హాస్టల్లో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ తిభోజనం మెనూ ప్రకారం ఇస్తున్నారా, రుచిగా ఉంటుందా? యూనిఫాం ఇచ్చారా, పాఠాలు అర్థం అవుతున్నాయా లేదా ? అని విద్యార్థినులను అడిగి తెలుసుకొన్నారు. ఇంచార్జ్ ఎంపీడీవో క్రిష్ణారెడ్డి, రీ సర్వే డీటీ కృష్ణమూర్తి ఉన్నారు.

# నైపుణ్యానికి ఏఐ పోర్టల్.. విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సులో ఆవిష్కరణ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాష్ట్రంలో యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పించేందుకు దేశంలోనే తొలిసారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర ప్రభుత్వం 'నైపుణ్యం' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకు వస్తోంది. అభ్యర్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు కృత్రిమ మేధ (ఏఐ)తో ఇంటర్వ్యూను ప్రవేశ పెడుతోంది. ప్లంబర్ నుంచి బీటెక్ టెక్నాలజీ విద్య వరకు ప్రతి అభ్యర్థి సామర్థ్యాన్ని ఏఐ అంచనా వేస్తుంది. నిరుద్యోగులు తమ అర్హతలతో ఏఐని వినియోగించి రెజ్యూమెను సైతం తయారు చేసుకునేలా దీన్ని తీర్చిదిద్దారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సులో ఈ పోర్టల్ ఆవిష్కరణ చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్దనున్న అన్ని రకాల డేటాను ఈ పోర్టల్‌తో అనుసంధానం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఈ-శ్రమ్, ఆధార్, డిజి లాకర్, ఈపీఎఫ్, ఆదాయ పన్ను చెల్లింపుదారుల వివరాలను అనుసంధించనున్నారు. అంటే వీటి ద్వారా ఎవరైనా ఇప్పటికే ఉద్యోగంలో ఉంటే ఆ వివరాలు తెలుస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం వద్ద పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు ఉన్న వివిధ విభాగాల డేటాను అనుసంధానిస్తారు. ఆర్థికశాఖ వద్దనున్న ఉద్యోగుల డేటాను కూడా దీనికి లింక్ చేస్తున్నారు. ఉద్యోగాల కల్పన సంస్థలు నౌకరీ, విజన్ ఇండియా వంటి సంస్థలు, ఇన్ఫోసిస్, యునిసెఫ్ వంటి అభ్యసన ప్లాట్‌ఫాంలు ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉండనున్నాయి. వాటి వద్ద ఉండే జాబ్? ఖాళీల వివరాలు ఈ పోర్టల్‌లో కనిపిస్తాయి.

ఈ పోర్టల్‌లో తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలో అభ్యర్థులు తమ అర్హతల ఆధారంగా రెజ్యూమె తయారు చేసుకోవచ్చు. ఆధార్ నంబరు నమోదు చేస్తే సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. తర్వాత వచ్చే వివరాలను నమోదు చేస్తే రెజ్యూమె వస్తుంది. పోర్టల్‌లో పౌరుడు, ఉద్యోగార్థులు, విద్యా సంస్థలు, శిక్షణ కేంద్రం, అంచనా కేంద్రం, శిక్షకులు, అడ్మినిస్ట్రేటర్ విభాగాలుగా లాగిన్లు ఉంటాయి.

నైపుణ్య కోర్సుల కోసం అభ్యర్థులు నమోదు చేసుకోవచ్చు. అన్నిరకాల శిక్షణ వివరాలు పోర్టల్‌లో ఉంటాయి. కావలసిన రంగాన్ని ఎంచుకుంటే దానికి సంబంధించిన నైపుణ్య కళాశాలలు, కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో వంటి వివరాలు కనిపిస్తాయి. అభ్యర్థి అక్కడకు వెళ్లి నచ్చిన కోర్సులో చేరవచ్చు. కోర్సు ప్రారంభం, ముగింపు, అర్హతలు, ఏ వయసు వారికి, జాతీయ నైపుణ్య అర్హత ఫ్రేమ్‌వర్క్‌లో అది ఏ స్థాయి ట్రైనింగ్ వంటి వివరాలు ఈ పోర్టల్‌లో ఉంటాయి. వీటి వద్ద దరఖాస్తు చేసుకునేందుకు ఆప్షన్ ఉంటుంది. అక్కడ క్లిక్ చేసి, సంబంధిత మిగతా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

నైపుణ్య శిక్షణ పూర్తయిన తర్వాత అభ్యర్థులు నేర్చుకున్న నైపుణ్యాలను ఏఐ ద్వారా మదింపు చేస్తారు. అభ్యర్థి ఎంతవరకు నేర్చుకున్నారు అనేదాన్ని మదింపు చేస్తుంది.

ఉద్యోగావకాశాలు విభాగంలోకి వెళ్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఏయే రంగాలు, విభాగాల్లో ఎక్కడ ఎన్ని ఖాళీలు ఉన్నాయో పోర్టల్‌లో కనిపిస్తాయి. అభ్యర్థి ఏదైనా విభాగాన్ని ఎంచుకుంటే దానికి అవసరమైన విద్యార్హతలు, అనుభవం, వయసు, ఉద్యోగం చేయాల్సిన ప్రాంతం మొదలైన వివరాలు స్క్రీన్ పై వస్తాయి. వాటిల్లో ఆసక్తి మేరకు ఎంచుకోవచ్చు.

ఉద్యోగాలు కల్పించే కంపెనీలు, ఉద్యోగులు అవసరమైన కంపెనీలు ఈ పోర్టల్‌లో నేరుగా తమ వద్ద ఉన్న జాబ్ ఖాళీల వివరాలు నమోదు చేసుకోవచ్చు. దీంతో ఈ పోర్టల్? ద్వారా అటు నిరుద్యోగ అభ్యర్థులకు, ఇటు అవసరం ఉన్న కంపెనీలకు మధ్య అనుసంధానం ఏర్పడుతుంది. ఈ పోర్టల్‌లో కంపెనీలు పాన్ కార్డు ద్వారా పూర్తి వివరాలు నమోదు చేయవచ్చు.

ఈ పోర్టల్‌లో ఏఐ ఇంటర్వ్యూ ఉంటుంది. తొలుత అభ్యర్థులు పేరు, ఉద్యోగం, అనుభవం వంటి వివరాలు నమోదు చేయాలి. టెక్నికల్, ప్రాక్టికల్ తదితర ప్రశ్నలు ఉంటాయి. వాటిని నింపగానే అభ్యర్థి సామర్థ్యాన్ని మదింపు చేసి వెల్లడిస్తుంది. ఆ ఉద్యోగానికి సంబంధించి లేదా సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు పూర్తి చేయగానే అభ్యర్థి ఏ స్థాయిలో ఉన్నారు. ఎక్కడ లోపం ఉందో, ఏం నేర్చుకోవాలో ఏఐ వారికి వెల్లడిస్తుంది. ఏఐ వర్చువల్ సహాయాన్ని అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. 'ఆస్క్ విద్య'పై క్లిక్ చేయగానే అందుబాటులో ఉన్న కోర్సులు, అవి ఎక్కడ ఉన్నాయి, తర్వాత వారం రోజుల్లో వచ్చే కోర్సులు ఏమిటో తెలుస్తాయి.

## 7న విద్యార్థుల భాగస్వామ్యంతో మెగ్గా ప్లాంటేషన్



**ఒంగోలు, పతాకం న్యూస్:** ఒంగోలు నగర సుందరీకరణ, మౌలిక సౌకర్యాల మెరుగుపై దృష్టి సారించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మరో భారీ కార్యక్రమానికి సన్నాహేలు చేస్తున్నారు. నగరంలో పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తూ పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 7న నగరంలో ఒకే రోజు ఐదువేల మొక్కలు నాటేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఒక్కో విద్యార్థి ఒక్కో మొక్కను ఏకకాలంలో నాటేలా నగరంలోని డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలతో మాట్లాడారు. ఆ విధంగా వేలాది మందిని కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నారు. నగరంలోని మంగమూరు రోడ్డు, గుంటూరు రోడ్డు కొత్తపట్నం రోడ్డు.. ఇలా మొత్తం ఎనిమిది ప్రధాన రోడ్లలో మొక్కలు నాటనున్నారు. ఆ కార్యక్రమంలో జిల్లాలోని కీలక ప్రజాప్రతిని?ధు లంతా పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. తొలుత గతనెల 24న మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆ రోజున డీఆర్సీ సమావేశం ఉండటంతో ఇన్‌చార్జి మంత్రి, జిల్లాకు చెందిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరవుతారని వారందరితో మొక్కలు నాటించాలని భావించారు. అయితే ఆ సమావేశం వాయిదా పడటంతోపాటు మొంథా తుఫాన్ ఆ సమయంలో నగరాన్ని ముంచెత్తడంతో కార్యక్రమం వాయిదా పడింది. తిరిగి ఈనెల 7న డీఆర్సీ సమావేశం జరగనుంది. ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు ఆ సమావేశానికి వస్తున్నారు. దీంతో ఆ సమావేశం లోపు వారందరూ మొక్కలు నాటేలా ఎమ్మెల్యే జనార్దన్ కార్యక్రమాన్ని రూపొందించారు. వేలాదిమంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉండటంతో ప్రణాళికాబద్ధంగా కార్యక్రమ నిర్వహణపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. రోడ్ల అత్యధిక భాగం సిమెంట్‌వి కాగా వాటికి ఇరువైపులా ఎక్కడ మొక్కలు నాటాలన్నది గుర్తించి మిషన్ల ద్వారా కటింగ్ చేసి గుంతలు తీస్తున్నారు. అలాగే పలు కళాశాలల యాజమాన్యాలతో మంగళవారం కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఏ కాలేజీ నుంచి ఎంతమంది విద్యార్థులు హాజరవుతారు, ఏ కాలేజీ వారు ఏ రోడ్డులో మొక్కలు నాటాలన్న దానిపై చర్చించారు. ఒక్కో బస్సులో 50 మంది కాలేజీ విద్యార్థులు వస్తే వారికి కాలేజీ నుంచి ఒకరు, కార్పొరేషన్ నుంచి ఒకరు సిబ్బంది అందుబాటులో ఉండి మొక్కలను క్రమపద్ధతిలో నాటించేలా షెడ్యూల్‌ను సిద్ధం చేస్తున్నారు. అలాగే మొక్కలు నాటే రోడ్డులో ట్యాంకర్లతో నీరు, ట్రాక్టర్ ద్వారా మట్టి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నారు. నగరంలో పచ్చదనం పెంపు కోసం చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోరారు.

## స్నేహితుడి సాయంతో మారిన తలరాత.. రాత్రికి రాత్రే కోటీశ్వరుడైన పేద వ్యాపారి

**పంజాబ్:** అదృష్టం ఎప్పుడు, ఎవరిని, ఎలా వరిస్తుందో చెప్పలేము. రాత్రికి రాత్రే ఓ సామాన్యుడిని కోటీశ్వరుడిగా మార్చేసింది. తోపుడు బండిపై కూరగాయలు అమ్ముకుని జీవనం సాగించే ఓ పేద వ్యాపారి తలరాతను లాటరీ టికెట్ మార్చేసింది. స్నేహితుడి దగ్గర అప్పు చేసి కొన్న టికెట్‌కు ఏకంగా రూ.11 కోట్ల జాక్‌పాట్ తగిలింది. పంజాబ్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌లోని జైపూర్ జిల్లా కోట్‌పుట్లికి చెందిన అమిత్ సెహ్రా బతుకుదెరువు కోసం తోపుడు బండిపై కూరగాయలు అమ్ముతుంటాడు. ఇటీవల పంజాబ్ పర్యటనకు వెళ్లిన ఆయన, భటిండాలోని ఓ దుకాణంలో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే "దీపావళి బంపర్ 2025" లాటరీ టికెట్‌ను చూశాడు. దానిని కొనడానికి తన వద్ద డబ్బు లేకపోవడంతో, తన స్నేహితుడి వద్ద అప్పు తీసుకుని కొనుగోలు చేశాడు. అక్టోబర్ 31న లాటరీ డ్రా ఫలితాలు వెలువడగా.. అమిత్ కొన్న టికెట్‌కే మొదటి బహుమతి అయిన రూ.11 కోట్లు దక్కింది. ఈ విషయం తెలుసుకున్న అమిత్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తన సంతోషాన్ని పంచుకుంటూ, "లాటరీ బహుమతి అందుకోవడానికి చండీగఢ్ వెళ్లేందుకు కూడా నా దగ్గర డబ్బుల్లేని పరిస్థితి. దేవుడే కరుణించి 'చప్పర్ ఫాడ్ కే' (ఊహించని విధంగా భారీ బహుమతి) ఇచ్చాడు" అంటూ కన్నీటి పర్యంతమయ్యాడు.



లాటరీలో గెలిచిన ఈ డబ్బును తన ఇద్దరు పిల్లల చదువుల కోసం వినియోగిస్తానని అమిత్ తెలిపాడు. అంతేకాకుండా, కష్టకాలంలో లాటరీ టికెట్ కొనడానికి డబ్బులిచ్చి ఆదుకున్న తన స్నేహితుడు ముఖేశ్‌కు రూ.1 కోటి ఇస్తానని ప్రకటించి తన మంచి మనసును చాటుకున్నాడు. అదృష్టం, స్నేహితుడి సాయం తన జీవితాన్నే మార్చేశాయని సంతోషం వ్యక్తం చేశాడు.

# రాత్రిళ్లు ఏం చేసినా నిద్ర రావడం లేదా?

సంపూర్ణ ఆరోగ్యానికి నిద్ర చాలా ముఖ్యం. రాత్రిపూట నిద్ర సరిగా పట్టకపోతే, మరునాడు చిరాకు, అలసట, విచారం కలుగుతాయి. అంతేకాకుండా, శారీరక స్పందనల వేగమూ తగ్గుతుంది. దీంతో తలనొప్పి, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు ఎన్నో చుట్టుముడతాయి. దీర్ఘకాలంగా తగినంత నిద్ర లేకపోతే నిద్రలేమి సమస్యకు దారితీస్తుందంటున్నారు నిపుణులు. దీనికి రకరకాల అంశాలు దోహదం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!



పగటి నిద్ర : పగటి పూట ఏదో కాసేపు కునుకు తీస్తే ఇబ్బందేమీ ఉండదని, మధ్యాహ్నం 3 గంటల తర్వాత నిద్రపోవడం వల్ల రాత్రి నిద్రపోవడం కష్టమవుతుందని పేర్కొంది. అంతేకాకుండా, సిర్కాడియన్ రిథమ్‌లో మార్పులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో పగటి పూట చురుకుగా, రాత్రి పూట నిద్ర వచ్చే ప్రక్రియ అస్తవ్యస్త మవుతుందని చెబుతున్నారు. కాబట్టి నిద్రలేమితో బాధపడు తున్న పగటి నిద్రను మానేస్తే మంచిదంటున్నారు.

కొంతమంది చదువు, ఆఫీస్ వర్క్ అంటూ నిరంతరం పనిచేస్తూ ఉంటారు. ఇలా రోజంతా పనులతో సతమతమైన మనసుకు, కండరాలకు విశ్రాంతి తప్పనిసరంటున్నారు నిపుణులు. అప్పటి వరకూ మనల్ని చురుకుగా ఉంచిన అడ్రినలిన్ హార్మోన్ మోతాదులు తగ్గుముఖం పట్టేలా చూసుకోవాలని తెలియజేస్తున్నారు. అంటే, పడుకోవటానికి కొద్ది గంటల ముందే శరీరాన్ని నిద్రకు సన్నద్ధం చేయాలని చెబుతున్నారు. అందువల్ల, నిద్రకు ఉపక్రమించే ముందు ఏ పనీ పెట్టుకోవద్దని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో నిద్రపోయే ముందు ఇష్టమైన పుస్తకం చదవటం, శ్రావ్యమైన సంగీతాన్ని వినటం, ధ్యానం చేయటం వంటి మనసుకు విశ్రాంతినిచ్చే పనులు చేయాలని సూచిస్తున్నారు. పడుకునే ముందు పుస్తకం చదవడం వల్ల నిద్ర నాణ్యత మెరుగుపడుతుందని అధ్యయనం పేర్కొంది.

శారీరక శ్రమ నిద్ర బాగా పట్టడానికి తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి, రోజూ ఉదయాన్నే వ్యాయామం చేయటం మంచిదంటున్నారు. ఆరుబయట నడక, పరుగు, సైకిల్ తొక్కటం వంటివి చేస్తే స్వచ్ఛమైన గాలికి మనసు, శరీరం ఉత్సాహంతో తొణికిసలాడతాయని వివరిస్తున్నారు. ఇలా చేయడం వల్ల రాత్రిపూట గాఢంగానూ నిద్ర పడుతుందని పేర్కొంటున్నారు.

నైట్ షిఫ్ట్ ఉద్యోగులు, తరచూ రాత్రిపూట ఆలస్యంగా పడుకునే వారిలో నిద్ర సమస్యలు తలెత్తటానికి ప్రధాన కారణం.. వేళకు నిద్ర పోకపోవటమే అని నిపుణులు అంటున్నారు. కాబట్టి రోజూ ఒకే సమయానికి పడుకోవటం, లేవటం చాలా ముఖ్యమని చెబుతున్నారు. దీంతో నిద్ర వేళలు నియమబద్ధం అవుతాయని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో సాయంత్రం వేళ గోరు వెచ్చటి నీటితో స్నానం చేయటం, గ్లాసు పాలు తాగటం, ఇంట్లో లైట్ల వెలుగు తగ్గించుకోవటం ద్వారా మరింత త్వరగానూ నిద్ర పట్టేలా చూసుకోవచ్చని సూచిస్తున్నారు.

%ణతీఱఅఒఱఅస్త్ర ఖ

%సాయంత్రం వేళల్లో టీ తాగడం (%+వీఎ ×ఖుస్త్రవం)

%ఆలస్యంగా భోజనం : రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేయటం, జీర్ణం కాని పదార్థాలు తినటం వల్ల గుండె వేగం, శరీర ఉష్ణోగ్రత పెరుగుతాయంటున్నారు నిపుణులు. ఇవి నిద్రను దెబ్బతీస్తాయని చెబుతున్నారు. కాబట్టి పడుకోవటానికి రెండు గంటల ముందే భోజనం చెయ్యాలని సూచిస్తున్నారు. కొవ్వు పదార్థాలకు బదులు తేలికగా జీర్ణమయ్యేవి తినాలని సలహా ఇస్తున్నారు. రాత్రిపూట షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉన్న ఆహారాలు తీసుకోవడం వల్ల కూడా నిద్ర డిస్టబ్ అవుతుందని %-చీఖ్ఱశీఅఖుశ్రీ ాఱఎతీఖుతీఎ శీట వీవసఱఅఎఱఅవ% పేర్కొంది.

కాఫీ, టీ ఎక్కువగా : మధ్యాహ్నం లేదా సాయంత్రం వేళల్లో కెఫిన్‌కు దూరంగా ఉండాలని %ఎసఎ% అధ్యయనం పేర్కొంది. కూల్ డ్రింకులు, రెడ్ వైన్, చాక్లెట్లు, ఛీజ్ వంటివీ నిద్రకు ఆటంకం కలిగిస్తాయని వివరిస్తున్నారు. అలాగే రాత్రిపూట మద్యం ఎక్కువగా తాగితే నిద్ర బాగా పడుతుందని కొంతమంది అనుకుంటారు. కానీ, అధిక మొత్తంలో మద్యం సేవించే వ్యక్తుల్లో నిద్ర నాణ్యత తక్కువగా ఉంటుందని పేర్కొంది.



# జుట్టు రాలే సమస్యతో బాధపడుతున్నారా?

నేటి కాలంలో చాలా మంది జుట్టు రాలే సమస్యతో బాధపడుతున్నారు. దీనికి కారణాలు ఏంటి? ఈ సమస్యని కంట్రోల్ చేసేందుకు ఏం చేయాలో తెలుసుకోండి.

వయసుతో సంబంధం లేకుండా జుట్టు రాలిపోవడం అనే సమస్య చాలా కామన్ అయిపోయింది. ప్రతి ఒక్కరికీ రోజులో కొన్ని వెంట్రుకలు రాలిపోవడం సహజమే. కానీ, ఎక్కువగా జుట్టు రాలుతుందంటే ముందు నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి సమస్యకి ఎన్నో కారణాలు ఉన్నట్టుగానే ఈ సమస్యకి కూడా చాలా కారణాలే ఉన్నాయి. అందులో ముఖ్యంగా కొన్ని ఉన్నాయి. అవేంటంటే..

పోషకాహారం మన ఆరోగ్యంతో పాటు మన జుట్టుకి కూడా అవసరమే. జుట్టు పెరగాలన్నా, రాలిపోకుండా ఉండాలన్నా పోషకాహారం ముఖ్యంగా ఐరన్ ఫుడ్స్ చాలా ముఖ్యం. జింక్, విటమిన్ ఏ, విటమిన్ డి ఫుడ్స్ రెగ్యులర్‌గా తీసుకోవాలి. వీటితో పాటు పండ్లు, కూరగాయలు, ప్రోటీన్స్, హోల్ గ్రెయిన్స్, గుడ్లు, నట్స్, చేపలు, పాలకూర వంటి ఫుడ్స్‌ని తీసుకోవడం మంచిది.

హైడ్రేటెడ్‌గా ఉండడం కూడా చాలా ముఖ్యం. దీని వల్ల స్కాల్ప్ మాయిశ్చరైజేషన్ అందుతుంది. కాబట్టి, జుట్టు కుదుళ్ళు హెల్దీగా మారతాయి. దీంతో పాటు మంచి సహజ నూనెలతో జుట్టుకి మసాజ్ చేయండి. దీని వల్ల కుదుళ్ళకి రక్తప్రసరణ అంది చక్కగా దృఢంగా మారి ఊడిపోకుండా ఉంటాయి. ఎసెన్షియల్ ఆయిల్స్ కూడా హెయిర్ ఫోలికల్స్‌కి రక్త ప్రసరణని చురుగ్గా అందేలా చేస్తాయి. దీని వల్ల జుట్టుకి పోషణ అందుతుంది. కొబ్బరినూనె, బాదం నూనె, ఆలివ్ నూనెతో మసాజ్ చేయండి. వీటితో పాటు లావెండర్, రోజ్‌మెరీ ఆయిల్స్ కూడా కొద్దిగా వేడి తలపై సున్నితంగా మసాజ్ చేయాలి. అరగంట తర్వాత తలస్నానం చేయాలి.అదే విధంగా, అలోవెరా జెల్ అందానికి, ఆరోగ్యానికి మెల్ప్ చేస్తుంది. ఈ జెల్‌ని తలకి రాసి 45 నిమిషాల పాటు తర్వాత మైల్డ్ షాంపూతో క్లీన్ చేయండి. దీని వల్ల %జూఎ% లెవల్స్ బ్యాలెన్స్ అయి హెల్దీ జుట్టు మీ సొంతమవుతుంది. జుట్టు స్ట్రాంగ్‌గా ఉండాలంటే ముందు నుంచి జుట్టుని చక్కగా శుభ్రంగా మెంటెయిన్ చేయాలి. ఇందుకోసం వారానికి రెండు నుంచి మూడు సార్లైనా తలస్నానం చేయాలి. దీంతో పాటు దువ్వెనలని క్లీన్ చేయడం, తలకి వాడే టవల్స్ వంటివాటిని కూడా క్లీన్‌గా ఉంచుకోవాలి. చుండ్రు రాకుండా చూసుకోండి. చాలా మంది తలస్నానం చేశాక జుట్టు త్వరగా ఆరడానికి డ్రైయర్స్ వాడుతుంటారు. అలా కాకుండా సాధ్యమైనంత వరకూ జుట్టు సహజంగానే ఆరిపోయేలా చూడండి. దీని వల్ల జుట్టు హెల్దీగా ఉంటుంది. సరిపడా నిద్ర కూడా జుట్టుపై ప్రభావం చూపిస్తుంది. కాబట్టి, చక్కగా నిద్రపోండి. ఇప్పటి వరకూ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చూశాం.

ఇక ఇప్పుడు ఎలాంటి వాటికి దూరంగా ఉండాలో తెలుసుకోండి. మీరు వాడే షాంపూ, కండీషనర్స్, స్టైలింగ్ ప్రోడక్ట్స్ కూడా ఎక్కువ కెమికల్స్ లేకుండా చూసుకోండి. దీని వల్ల జుట్టు ఎక్కువగా రాలుతుంది. కాబట్టి, ముఖ్యంగా సల్ఫేట్ లేని ప్రొడక్ట్స్‌ని వాడండి. స్ట్రెయిటనర్ కర్లింగ్ ఐరన్ వంటి ఎక్కువగా వాడినా జుట్టు రాలుతుంది. అవకాశం ఉంది. కాబట్టి, జుట్టుని ఎక్కువగా వేడి తగలకుండా చూడండి. దీని వల్ల జుట్టు బలహీనంగా మారుతుంది.

జుట్టు రాలిపోవడం వల్ల ఒత్తిడి వస్తే.. ఒత్తిడి కారణంగా కూడా జుట్టు రాలుతుంది. కాబట్టి, ఒత్తిడిని దూరం చేసుకోవాలి.

# పోస్టల్ డిపార్ట్ మెంట్ నుంచి కొత్త యాప్




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మారుతున్న కాలానికి అనుగుణంగా భారత తపాల శాఖ (పోస్టల్ డిపార్ట్‌మెంట్) తన సేవలను ఆధునికీకరిస్తూ ప్రజలకు మరింత చేరువవుతోంది. ఒకప్పుడు కేవలం ఉత్తరాల బట్వాడాకే పరిమితమైన పోస్టాఫీసులు, ఇప్పుడు బ్యాంకింగ్‌తో పాటు అనేక రకాల సేవలను అందిస్తున్నాయి. ఈ క్రమంలోనే తమ సేవలను మరింత వేగంగా, సౌకర్యవంతంగా ప్రజల అరచేతిలోకి తెచ్చేందుకు "డాక్ సేవ" పేరుతో ఒక కొత్త మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. 'ఇక పోస్టాఫీస్ మీ జేబులోనే' అనే నినాదంతో తపాల శాఖ ఈ యాప్‌ను తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా పరిచయం చేసింది. ఈ ఒక్క యాప్‌తో పోస్టాఫీసు అందించే కీలక సేవలను ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా స్మార్ట్ ఫోన్ ద్వారానే పొందవచ్చని తెలిపింది. పార్శిల్ ట్రాకింగ్, పోస్టేజ్ ఛార్జీల లెక్కింపు, ఫిర్యాదుల నమోదు, ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపు వంటి అనేక సేవలు ఇందులో ఉన్నాయి.

డాక్ సేవ యాప్ ద్వారా వినియోగదారులు తమ స్పీడ్‌పోస్ట్, రిజిస్టర్డ్ పోస్ట్, మనీ ఆర్డర్ వివరాలను రియల్ టైమ్‌లో ట్రాక్ చేసుకోవచ్చు. జాతీయ, అంతర్జాతీయ పార్శిళ్లకు ఎంత ఖర్చవుతుందో సులభంగా లెక్కించవచ్చు. ఇకపై స్పీడ్‌పోస్ట్, పార్శిల్ బుకింగ్ వంటి సేవల కోసం గంటల తరబడి పోస్టాఫీసుల వద్ద క్యూలో నిలబడాల్సిన అవసరం లేకుండా, నేరుగా యాప్ నుంచే బుక్ చేసుకునే సౌకర్యం కల్పించారు.

అంతేకాకుండా, జీపీఎస్ సహాయంతో తమకు సమీపంలో ఉన్న పోస్టాఫీసుల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. కార్పొరేట్ వినియోగదారుల కోసం ఈ యాప్‌లో ఒక ప్రత్యేక విభాగాన్ని కూడా ఏర్పాటు చేశారు. మొత్తంగా ఈ యాప్ ద్వారా తపాల శాఖ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది.

# రాష్ట్రంలో పరిశ్రమలు-అభివృద్ధి స్వభావం



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తనయుడు లోకేష్ వివిధ దేశాల్లో వున్న బడా పారిశ్రామిక సంస్థల అధినేతలను కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని వారికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నెల 14, 15 తేదీలలో విశాఖపట్నంలో జరగబోతున్న పెట్టుబడుల భాగస్వామ్య సమిట్‌కు ఆహ్వానిస్తున్నారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతోటే స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ పేర 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చాలని, అందుకు ఏడాదికి 15 శాతం వృద్ధిరేటును సాధించాలని, రాబోయే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యాలను పెట్టుకొని విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. ఈ లక్ష్యాన్ని సాధించాలనే పేర రాష్ట్రంలో విచ్చలవిడిగా బలవంతపు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతోంది. విశాఖ-చెన్నై కారిడార్‌లో ఫార్మా, కెమికల్ పార్కులు, 9 భారీ పారిశ్రామిక కేంద్రాలు, 25 పారిశ్రామిక క్లస్టర్లు, 500 పారిశ్రామిక ఎస్టేట్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ప్రకటించింది. ప్రైవేట్ పెట్టుబడులను రాబట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు, ఐ.టి, విద్యుత్, ఎలక్ట్రానిక్స్, టూరిజం వంటి అనేక రంగాలకు ప్రత్యేక విధాన పత్రాలను విడుదల చేసింది. జీఎస్టీ, పెట్టుబడుల సబ్సిడీ, విద్యుత్ రాయితీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చార్జీల రద్దు ఇలా వేల కోట్ల విలువ చేసే రాయితీలు ప్రకటించింది. అంతేగాక అతి తక్కువ రేటుకు భూములు కేటాయిస్తున్నది. రోడ్లు, విద్యుత్, రైల్వే లైన్లు, మంచి నీరు వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వ ఖర్చుతోనే కల్పిస్తున్నది. వీటన్నిటితో పాటు కార్మికుల పనిగంటలు 8 నుండి 10 గంటలకు పెంచింది. రాత్రి వేళల్లో మహిళా కార్మికులతో పని చేయించుకునేందుకు అనుమతిస్తూ చట్టం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రైవేట్ పరిశ్రమల అభివృద్ధి స్వభావాన్ని, వాటిలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు, వారి జీవనం, పరిశ్రమ చుట్టూ ఉన్న ప్రాంతాల అభివృద్ధి, వాటి భౌగోళిక విస్తరణ, ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులు, ప్రభుత్వ ఖజానాకు వస్తున్న ఆదాయం ఆ ప్రాంతంలో విస్తరించిన సేవారంగం స్థితి వంటి వాటిని పరిశ్రమలవారీగా పరిశీలిస్తే వాటి అభివృద్ధి నైజం, విచ్చలవిడి దోపిడీ, పాలకుల వర్గ నీతి సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఈ పరిశీలన కోసం విశాఖపట్నంలో ఉన్న ప్రభుత్వ పోర్టుతో పాటు రాష్ట్రంలో గంగవరం, కృష్ణపట్నం దగ్గర ఉన్న అదానీ పోర్టులను తీసుకున్నాం. ఈ పోర్టులకు సంబంధించి అందుబాటులో ఉన్న కొన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని విశ్లేషించాం. విశాఖపట్నం పోర్టు స్వాతంత్ర్యం ప్రారంభ కాలంలో ప్రభుత్వ రంగంలో ఏర్పడి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రభుత్వ పోర్టు. అదానీ పోర్టులు ప్రభుత్వ సహకారంతో ప్రైవేట్ రంగంలో 17 ఏళ్ల క్రితం ఏర్పడినవి. ఒక పరిశ్రమ, అది సృష్టించిన అభివృద్ధిని సమగ్రంగా అంచనా వేయటానికి దశాబ్దంన్నర కాలం చాలా ఎక్కువే. మొదటగా విశాఖపట్నం పోర్టును పరిశీలిద్దాం. ఇది ప్రభుత్వ పెట్టుబడులతో ఏర్పడిన పోర్టు. ప్రస్తుతం 4 వేల మంది పర్మినెంటు, 10 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు వివిధ ప్రైవేటు సంస్థల కింద పోర్టు కార్యకలాపాల్లో పనిచేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సర ఆదాయ వ్యయాలను చూద్దాం. 82.62 మిలియన్ టన్నుల కార్గోను ఈ ఏడాది పోర్టు హ్యాండిల్ చేసింది. మొత్తం రూ.2074 కోట్లు ఆదాయంతో పాటు రూ.724 కోట్లు నికర లాభాలు గత ఏడాది ఆర్జించింది. వచ్చిన ఆదాయంలో కార్మికుల వేతనాలకు రూ.385 కోట్లు (18.56 శాతం) చెల్లించింది. కేంద్ర భద్రతా బలగాలైన సి.ఎస్.ఐ.ఎఫ్ జవానులు 501 మంది పని చేస్తున్నారు. వీరి వేతనాలకు రూ.48.45 కోట్లు చెల్లించింది. అలాగే పనిచేస్తున్న కార్మికులకు, రిటైర్ అయినవారి వైద్య సేవలకు 40 పడకల ఆసుపత్రి నిర్వహణకు, ఇతర రిఫరల్ హాస్పిటళ్లకు సుమారు రూ.74 కోట్లు ఖర్చు చేసింది. మరో రూ.328 కోట్లు పోర్టులో పనిచేసి రిటైరయిన సుమారు 16 వేల మందికి పెన్షన్ కోసం చెల్లించింది. ఈ సొమ్మును పోర్టు సొంత పెన్షన్ నిధి నుండి చెల్లించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్టీ, కస్టమ్స్, కార్పొరేట్ పన్నుల రూపంలో రూ.356 కోట్లు (వచ్చిన మొత్తం ఆదాయంలో 17.16 శాతం) బదిలీ చేసింది. మహా విశాఖ నగర పాలక సంస్థకు ఆస్తి పన్ను రూ. 93.59 కోట్లు చెల్లించింది. ఇదిగాక నగరంలో వివిధ రోడ్ల నిర్మాణాల కోసం మరో రూ.15 వేల కోట్ల పైనే ప్రతి ఏడాది ఖర్చు చేస్తున్నది. సామాజిక బాధ్యత కింద అనేక వితరణ కార్యక్రమాలు కూడా చేపడుతున్నది. ఈ పోర్టు విశాఖ నగర అభివృద్ధిలో చాలా కీలక పాత్ర పోషించింది. పోర్టు అభివృద్ధితో పాటు నగర అభివృద్ధి పెనవేసుకొని కొనసాగింది. పోర్టు ఆధారంగా ఎన్నో ప్రైవేట్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పడ్డాయి. వందల మంది పెట్టుబడిదారులు కొత్తగా అభివృద్ధి చెందారు. 1990 నాటికి 20 వేల మంది పర్మినెంట్ కార్మికులతో పాటు మరో 10 వేలమంది కాంట్రాక్ట్ కార్మికులు ఉండేవారు. విద్యా, వైద్య, గృహ, ఇతర అనేక సేవా రంగాలపై బలమైన ప్రభావాన్ని కలిగించింది. నగరంలో వ్యాపార వాణిజ్య అభివృద్ధికి జీవం పోసింది. నగర విస్తరణకు తోడ్పడింది. అందులో పనిచేసే వారికి శక్తివంతమైన ఆర్థిక జీవన శక్తిని కల్పించింది. విశాఖపట్నంలో ఉన్న అదానీ గంగవరం పోర్టు అభివృద్ధిని పరిశీలిద్దాం. ఇది రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పిపిపి పేర ప్రైవేట్ రంగంలో 2004లో ఏర్పడిన పోర్టు. గత 17 ఏళ్ల నుండి కార్యకలాపాలు సాగిస్తున్నది. నాలుగేళ్ల క్రితం అదానీ యాజమాన్యం కేంద్ర బిజెపి సర్కార్ అండతో బలవంతంగా ఈ పోర్టును డివిఎస్ రాజు (ప్రాంతీయ పెట్టుబడిదారుడు) నుండి తమ వశం చేసుకుంది. రాష్ట్ర వాటాను కూడా కొనేసింది. ఈ పోర్టుకి రాష్ట్ర ప్రభుత్వమే 2 వేల ఎకరాల భూమిని కేటాయించింది.




## మహిళల వరల్డ్ కప్ విజయం వెనుక
# అమోల్ మజుందార్



వన్డే ప్రపంచకప్ టైటిల్ కొట్టడం లో ఆటగాళ్ల పాత్ర ఎంత కీలకమో.. తెర వెనుక కోచ్ పాత్ర అంతకుమించి ఉంది. క్రీడాకారిణుల ఫిట్‌నెస్, జట్టు ఎంపిక, కెప్టెన్, ఆటగాళ్లకు దిశా నిర్దేశం, డ్రింక్స్‌బ్రేక్ సమయంలో కెప్టెన్‌కు ఎత్తుగడలను చేరవేయడం.. ఇలా ప్రతి విభాగంలో కోచ్ పాత్ర మరువలేనిది. ఇందుకు నిదర్శనమే వన్డే ప్రపంచకప్‌ను సాధించిన వెంటనే టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ పరిగెత్తుకొని వెళ్లి ఒక వ్యక్తి కాళ్లకు నమస్కరించి, ఆలింగనం చేసుకొని కన్నీళ్లు పెట్టుకోవడం. అతడు మరోవరో కాదు.. టీమిండియా హెడ్ కోచ్ అమోల్ మజుందార్. క్రికెటర్‌గా 21ఏళ్ల ప్రొఫెషనల్ కెరీర్‌లో ఏనాడూ జాతీయ జట్టుకు ఎంపకవ్వని ఆయన, ఇప్పుడు కోచ్‌గా మహిళా జట్టుకు దిశా నిర్దేశం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే భారత మహిళలజట్టును ప్రపంచ చాంపియన్స్‌గా తీర్చిదిద్దాడు.

మజుందార్ దేశవాళీ క్రికెట్ ఆడే క్రమంలో భారత క్రికెట్ జట్టులో మరో సచిన్ అవుతాడని భావించారు. దేశవాళీ క్రికెట్లో ముంబయి తరఫున పరుగుల వరద పారించాడు. 'ది వాల్'గా పేరు తెచ్చుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 171 మ్యాచుల్లో 11,167పరుగులు చేశాడు. ఇందులో 30సెంచరీ ల, 60అర్ధసెంచరీలు ఉన్నాయి. ఇక 113 లిస్ట్-ఎ క్రికెట్ మ్యాచుల్లో 3,286పరుగులు కొట్టాడు. 3సెంచరీలు, 26అర్ధసెంచరీలు చేశాడు. కానీ ఆయనకు ఒక్కసారి కూడా టీమిండియా తరఫున ఆడే అవకాశం దక్కలేదు. అయినా నిరుత్సాహానికి గురికాలేదు. భారత మహిళలజట్టుకు కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాక తన పూర్వ వైభవాన్ని రంగరించి క్రీడాకారిణులను మెరికల్లా తీర్చిదిద్దాడు. దీంతో భారత మహిళల జట్టు వన్డే వరల్డ్ కప్ గెలవడంలో కోచ్‌గా కీలక పాత్ర పోషించాడు. ఫైనల్లో సౌతాఫ్రికాపై గెలిచిన తర్వాత టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ వెళ్లి ముజుందార్ కాళ్లు మొక్కింది. దీన్ని బట్టి భారత జట్టు కప్ గెలవడం వెనుక ఆయన కృషి, పట్టుదల ఎంత ఉందో అర్థం అవుతుంది. భారత జట్టుకు ఆడలేకపోయినప్పటికీ.. కోచ్‌గా ఆ సంతృప్తిని పూర్తి చేసుకున్నాడు. మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్లోనే కాదు.. టోర్నీ చరిత్రలో ఏ ప్లేయర్ సాధించని ఒక రికార్డును దీప్తి శర్మ ఈ ప్రపంచకప్‌లో నెలకొల్పింది. ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లో అర్ధసెంచరీతో పాటు ఐదు వికెట్లు తీసిన తొలి ప్లేయర్(పురుషులు, మహిళల)గా చరిత్ర సృష్టించింది. ప్రపంచకప్‌లో 22 వికెట్లు తీసిన మూడో ప్లేయర్‌గా, ఒక వరల్డ్‌కప్ ఎడిషన్‌లో 200కు పైగా పరుగులు, 20కు పైగా వికెట్లు తీసిన తొలి క్రీడాకారిణిగా దీప్తి మరో రికార్డును నెలకొల్పింది. దీప్తి శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు దక్కిన సంగతి తెలిసిందే. ఇక భారత మహిళల జట్టు ప్రధాని నరేంద్ర మోడీని కలిసేందుకు మంగళవారం ముంబయి నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

# అర్ష్‌దీప్ సింగ్ అనుభవం కలిగిన ఆటగాడు: కోచ్ మోర్నీ మోర్కెల్




ఆస్ట్రేలియాతో జరిగిన తొలి రెండు టీ20 మ్యాచ్‌లలో తనను తుది జట్టులోకి ఎందుకు తీసుకోలేదో పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అర్థం చేసుకున్నాడని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. క్వీన్ లాండ్ వేదికగా ఆస్ట్రేలియా-భారత్ జట్ల మధ్య గురువారం నాలుగో టీ20 మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో మోర్నీ మోర్కెల్ మీడియా సమావేశంలో మాట్లాడాడు. అర్ష్‌దీప్ సింగ్ ఎంతో అనుభవం కలిగిన ఆటగాడని, ప్రపంచస్థాయి బౌలర్ అని ఆయన ప్రశంసించాడు. పవర్‌ప్లేలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ అతడని తెలిపాడు. జట్టుకు అతడి విలువ ఏమిటో తమకు తెలుసని వ్యాఖ్యానించాడు. అయితే ఈ పర్యటనలో తాము వివిధ కాంబినేషన్లను ప్రయత్నించామని, ఇది అర్ష్‌దీప్ సింగ్ అర్థం చేసుకున్నాడని అన్నాడు. జట్టు ఎంపిక అనేది కేవలం మేనేజ్‌మెంట్‌కు మాత్రమే పరిమితం కాదని, ఆటగాళ్లకు కూడా ఒక సవాలేనని ఆయన పేర్కొన్నాడు. టీ20 ప్రపంచ కప్ సమీపిస్తున్న తరుణంలో భిన్న కూర్పులకు ప్రయత్నిస్తున్నామని చెప్పాడు. దీనివల్ల ఆటగాళ్లు తమకు అవకాశం రాలేదని నిరుత్సాహపడే అవకాశం ఉంటుందని, కానీ మేనేజ్‌మెంట్ ఆలోచన మరో విధంగా ఉంటుందని ఆయన వెల్లడించాడు. ఆటగాళ్లను మరింత శ్రమించేలా ప్రోత్సహిస్తామని, ఎప్పుడు అవకాశం వచ్చినా అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించేలా వారిని సన్నద్ధం చేస్తామని ఆయన అన్నాడు.

# స్పోర్ట్స్ - సినిమా



## శరవేగంగా రామ్‌చరణ్ 'పెద్ది' షూటింగ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'. ఈ సినిమాపై అభిమానుల్లో అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి తొలి పాటను విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమైంది. 'చికిరి చికిరి' అంటూ సాగే ఈ పాట పుట్టుక వెనుక ఉన్న ఆసక్తికర సంభాషణను వివరిస్తూ మేకర్స్ ఓ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు.

సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్‌తో దర్శకుడు బుచ్చిబాబు జరిపిన సంభాషణ ఈ వీడియోలో ఉంది. 'పెద్ది' ఫస్ట్ షాట్‌కు అద్భుతమైన స్పందన వచ్చిందని, ఇప్పుడు సెకండ్ షాట్ రూపంలో తొలి పాటను సిద్ధం చేయాలని బుచ్చిబాబు కోరారు. పాట సిచ్యుయేషన్ గురించి రెహమాన్ అడగ్గా, పల్లెటూళ్లలో కాటుక అవసరం లేని అందమైన కళ్లు... ముక్కుపుడక అక్కర్లేని తీరైన ముక్కు కలిగి ఉన్న అందమైన అమ్మాయిని 'చికిరి' అని పిలుస్తారని బుచ్చిబాబు వివరించారు. అలాంటి అమ్మాయిని హీరో చూసే సన్నివేశం అని రెహమాన్ క విడమర్చి చెప్పారు. అయితే 'చికిరి' అనే పదం రెహమాన్‌ను ఎంతగానో ఆకట్టుకుంది. "చికిరి అంటే ఏమిటి?" అని అడిగి తెలుసుకున్న ఆయన, ఆ పదాన్నే హుక్ వర్డ్‌గా చేసుకుని ట్యూన్ కడతానని చెప్పారు.

ఈ సందర్భంగా బుచ్చిబాబు తన చిన్ననాటి జ్ఞాపకాలను రెహమాన్‌తో పంచుకున్నారు. తాను ఏడో తరగతిలో ఉన్నప్పుడు తన కజిన్ బాబీ ఇచ్చిన 'బొంబాయి' సినిమా పాటల క్యాసెట్ విన్నప్పటి నుంచి ఆయనకు పెద్ద అభిమానిని అయ్యానని తెలిపారు. 'పెద్ది' కథ ఫైనల్ అయ్యాక సంగీత దర్శకుడిగా మరో ఆలోచన లేకుండా రెహమాన్‌నే ఎంచుకున్నట్లు బుచ్చిబాబు తన మనసులోని మాటను బయటపెట్టారు.

ప్రముఖ గాయకుడు మోహిత్ చౌహాన్ ఆలపించిన 'చికిరి చికిరి' పూర్తి పాటను నవంబర్ 7న విడుదల చేయనున్నారు. ఇక 'పెద్ది' సినిమాను 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాను వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

## 'బిగ్‌బాస్'పై విష్ణుప్రియ సంచలన వ్యాఖ్యలు



తెలుగు టెలివిజన్ రంగంలో అత్యంత ప్రజాదరణ పొందిన రియాలిటీ షో 'బిగ్‌బాస్'. ప్రస్తుతం తొమ్మిదో సీజన్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ షోపై మాజీ కంటెస్టెంట్, ప్రముఖ యాంకర్ విష్ణుప్రియ సంచలన వ్యాఖ్యలు చేశారు. బిగ్‌బాస్ హౌస్‌కు వెళ్లడం తన జీవితంలో తీసుకున్న అతిపెద్ద తప్పుడు నిర్ణయమని ఆమె చెప్పడం ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది.

'పోవే పోరా' వంటి టీవీ షోలతో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకున్న విష్ణుప్రియ, సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరగా ఉంటారు. గతంలో ఆమె బిగ్‌బాస్ హౌస్‌లో కంటెస్టెంట్‌గా పాల్గొని, తోటి కంటెస్టెంట్ పృథ్వీతో ఉన్న సాన్నిహిత్యం కారణంగా వార్తల్లో నిలిచారు. అయితే, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, తన బిగ్‌బాస్ అనుభవంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విష్ణుప్రియ మాట్లాడుతూ, "నేను బిగ్‌బాస్ షోకు కేవలం డబ్బుల కోసమే వెళ్లాను. ఆ డబ్బుతో కొత్త ఇల్లు కట్టుకోవచ్చని ఆశపడ్డాను. కానీ నా ఆశ నెరవేరలేదు. ఇప్పటికీ నేను పాత ఇంట్లోనే ఉంటున్నాను. నిజం చెప్పాలంటే, బిగ్‌బాస్ హౌస్‌కు వెళ్లడం నా జీవితంలో నేను తీసుకున్న ఓ చెత్త నిర్ణయం. ఆ షో నుంచి నేనేమీ నేర్చుకోలేదు. నన్ను నేనే తిట్టుకున్నాను. ఎందుకు వెళ్లానురా బాబూ అనిపించింది. నా చెప్పుతో నన్ను నేనే కొట్టుకోవాలి అనిపించేంతగా బాధపడ్డాను. మళ్లీ వాళ్లు పిలిచినా వెళ్లను" అని తన ఆవేదనను వెళ్లగక్కారు.

ప్రస్తుతం బిగ్‌బాస్ కొత్త సీజన్ విజయవంతంగా నడుస్తున్న తరుణంలో విష్ణుప్రియ చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. కొందరు ఆమె నిజాయతీని మెచ్చుకుంటుండగా, మరికొందరు "షో ద్వారా వచ్చిన పాప్యులారిటీని ఆస్వాదించి ఇప్పుడు ఇలా మాట్లాడటం సరికాదు" అంటూ విమర్శిస్తున్నారు. ఏదేమైనా, విష్ణుప్రియ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు బుల్లితెర వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.




## 14న రీరిలీజ్ కానున్న 'శివ'



కింగ్ నాగార్జున కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోయిన కల్ట్ క్లాసిక్ 'శివ' సరికొత్త టెక్నాలజీతో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భారతీయ సినిమాను 'బిఫోర్ శివ', 'ఆఫ్టర్ శివ'గా మార్చిన ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 4కే డాల్బీ ఆట్మాస్ టెక్నాలజీతో నవంబర్ 14న గ్రాండ్‌గా రీరిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అభిమానుల సమక్షంలో రీరిలీజ్ ట్రైలర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి నాగార్జున, దర్శకుడు రామ్ గోపాల్ వర్మ హాజరయ్యారు.

అద్భుతమైన 4కే విజువల్స్, డాల్బీ ఆట్మాస్ సౌండ్‌తో విడుదలైన ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ప్రతి సన్నివేశంలోనూ టెన్షన్, ఎమోషన్‌ను కొత్త సౌండ్ డిజైన్ మరింతగా పెంచింది. ముఖ్యంగా ట్రైలర్ చివర్లో నాగార్జున సైకిల్ చైన్ లాగే ఐకానిక్ సీన్ గూస్‌బంప్స్ తెప్పించింది. ఈ ట్రైలర్‌తో 'శివ' మ్యాజిక్‌ను థియేటర్లలో కొత్తగా అనుభూతి చెందాలనే ఆసక్తి ప్రేక్షకులలో రెట్టింపయింది.

ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, "36 ఏళ్ల క్రితం నన్ను పెద్ద స్టార్‌ను చేసిన చిత్రం 'శివ'. పొద్దున్నే రీమాస్టర్ చేసిన సినిమా చూశాను. సౌండ్ డిజైన్ స్టన్నింగ్‌గా అనిపించింది. రాము (రామ్ గోపాల్ వర్మ) దాదాపు 6 నెలలు కష్టపడి ప్రతి సౌండ్ ట్రాక్‌ను ఎంతో ఇష్టంగా డిజైన్ చేశాడు. డాల్బీ ఆట్మాస్‌లో 'శివ' థియేటర్లలో మైండ్ బ్లోయింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. నవంబర్ 14న మీరందరూ ఈ సినిమాను కొత్తగా చూడబోతున్నారు. మరో 36 ఏళ్ల తర్వాత కూడా ఈ సినిమాను మళ్లీ తీసుకురావాలని కోరుకుంటున్నాను," అని తెలిపారు.

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ..చిరంజీవి చెప్పినట్టు సినిమా ఉన్నంతకాలం 'శివ' కూడా చిరంజీవిలా చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు. 1989లో రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై అక్కినేని వెంకట్, వై. సురేంద్ర నిర్మించారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**